


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 104 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 06 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-



అమెరికా ఉపాధ్యక్షుడు

## జేడీవాన్స్ నివాసంపై దాడి

వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇంటిపై దాడి జరిగింది. ఒహాయోలోని ఆయన నివాసంపై దాడి జరిగినట్లు అమెరికన్ మీడియా తెలిపింది. దాడి సమయంలో వాన్స్,

మిగతా .. 2లో..



## వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా రోడ్రిగ్జ్?

90 రోజులపాటు అధికారంలో ఉండనున్న నేత
ఆమే అధికారం చేపట్టాలన్న ఆ దేశ సుప్రీం కోర్టు

కారకాస్, న్యూయార్క్, వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ : వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు, చమురు, ఆర్థికశాఖల మంత్రి డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు

మిగతా .. 2లో..



## గ్యాస్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీ హరీష్ బాలయోగి

అధికారులను అప్రమత్తం చేసిన ఎంపీ

మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్‌జీసీ గ్యాస్

మిగతా .. 2లో..

# మాతృభాషను విస్మరిస్తే మన ఉనికిని కోల్పోయినట్లే..

### రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రకటన

### మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో సీఎం చంద్రబాబు ప్రసంగం



గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ : మాతృభాష మన మూలా లకు, మన సంస్కృతికి ప్రతీక అని, ప్రపంచంతో పోటీ పడేందుకు ఆంగ్ల భాష అవసరమైనప్పటికీ మాతృభాషను విస్మరిస్తే మన ఉనికినే కోల్పోయి నట్లవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేశారు. గుంటూరులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో మూడు రోజులుగా నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రబాబు ప్రసంగించారు. "సంక్రాంతికి ముందే వచ్చిన పండుగ ఈ ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు పేరును ఈ వేదికకు పెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. తెలుగు భాషకు అత్యంత ఘనమైన చరిత్ర ఉందని, దేశంలో వందలాది భాషలు ఉన్నప్పటికీ ప్రాచీన హోదా పొందిన ఆరు భాషల్లో తెలుగు ఒకటని సీఎం గుర్తుచేశారు. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో అత్యధికంగా మాట్లాడే నాలుగో భాష తెలుగు అని, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని వివరించారు. దాదాపు 40 దేశాల నుంచి ప్రతినిధులు ఈ మహాసభలకు

మిగతా .. 2లో..

## అమెరికాలో రోడ్డు ప్రమాదం..

తెలుగు దంపతుల మృతి



యలమంచిలి, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు దంపతులు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భార్యాభర్తలు కొటికలపూడి కృష్ణ కిశోర్ (టిన్ను) (45), ఆశ (40) వాషింగ్టన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారి కుమార్తె, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు

మిగతా .. 2లో..

నేను సంతోషంగా లేనని

## మోడీకి తెలుసు

### సుంకాలు పెంచుతానని హెచ్చరించిన ట్రంప్



విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మరోసారి సుంకాలను పెంచే అవకాశం ఉంది. ఈమేరకు ఆయన హెచ్చరికలు జారీ చేస్తూ వ్యాఖ్యానించినట్లు ఓ ఆంగ్ల మీడియా సంస్థ పేర్కొంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో విషయంలో తర్వాత చేపట్టబోయే చర్యలను పేర్కొంటున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశారు. " ప్రధాని మోదీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. వారు (రష్యాతో) వ్యాపారం కొనసాగిస్తే.. మనం సుంకాలను చాలా వేగంగా పెంచుతాము" అన్న ఆడియో క్లిప్‌ను శ్వేతసౌధం ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. ఇక "రష్యా చమురు అంశంలో భారత్ మాకు సాయం చేయకపోతే.. మేము

## కాలుష్యంపై పోరుకు 'సముద్ర ప్రతాప్'..

ప్రారంభించిన రాజ్‌నాథ్‌సింగ్



విశ్వం వాయిస్ న్యూస్ : 'సముద్ర ప్రతాప్' నౌకను సోమవారం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జల ప్రవేశం చేయించారు. గోవా షిప్‌యార్డ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీనిని ఇప్పటికే భారత తీరగస్తీ దళానికి (ఇండియన్ కోస్ట్‌గార్డ్)

మిగతా .. 2లో..

మాట వినకుంటే మదురో కంటే

## ఘోరమైన గతి..

### వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలికి ట్రంప్ వార్నింగ్



వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ : వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు. అగ్రరాజ్యం మాట వినకుంటే ఆమె భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఓ మీడియా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించడంతో ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక

మిగతా .. 2లో..

### 'బీఆర్ఎస్ నన్ను ఘోరంగా అవమానించింది'..

## మండలిలో కవిత కంటతడి



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. "బీఆర్ఎస్‌లో ఏ బాధ్యత ఇచ్చినా

మిగతా .. 2లో..

## ఓఎన్జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్..

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆరా



మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకైంది. మలికి పురం మండలం ఇరుసుమండలో సుమారు 2 గంటలుగా గ్యాస్ పైకి చిమ్ముతోంది. దీంతో మంటలు చెలరేగాయి. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ శ్రీని వాసరావు పరిశీలించారు. దీనిపై ఓఎన్జీసీ ఉన్నతాధికారులకు తెలియ జేశామని.. ఆ సంస్థ సాంకేతిక నిపుణులు చేరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ అధికారుల అప్రమత్తతతో గ్రామాన్ని ప్రజలు ఖాళీ చేశారు. ఇరుసుమండలో పెద్ద ఎత్తున కొబ్బరితోటలు దగ్ధమవుతున్నాయి. ఇరుసుమండ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున శబ్దాలు రావడంతో స్థానికులు ఆందోళన పడుతున్నారు. మంటల ధాటికి 500కిపైగా కొబ్బరి చెట్లు కాలిపోయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పరిస్థితులను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ పర్యవేక్షిస్తున్నారు. చుట్టుపక్కల 5కి.మీల పరిధిలో ఉన్న ప్రజలను ఖాళీ చేయిస్తున్నట్లు తెలిపారు.

**సీఎం చంద్రబాబు ఆరా**

ఓఎన్జీసీ మోరీ -5 వెల్‌లో మంటలు చెలరేగిన ఘటనపై సీఎం చంద్రబాబు

మిగతా .. 2లో..

తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో

## ఎన్డీయేదే విజయం

కేంద్రమంత్రి అమిత్ షా ధీమా



చెన్నై (ఆర్కేనగర్) : తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ఈ ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయేదే విజయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులోని పుదుకోట్టై జిల్లా పల్లత్తివయల్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా మారిందని, ఇక్కడి

మిగతా .. 2లో..

ఏ దేశమూ

## ప్రపంచ పోలీస్ కాదు

మదురో నిర్బంధంపై చైనా ఆగ్రహం



విశ్వం వాయిస్ న్యూస్ : వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్య కాలంలో ఎక్కువ య్యాయని అగ్రరాజ్యంపై మండి పడింది. ప్రపంచ పోలీస్ లేదా అంతర్జాతీయ న్యాయ మూర్తిగా వ్యవహ రించేందుకు ఏ దేశానికీ అధికారం లేదని పేర్కొంది." ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ

మిగతా .. 2లో..

## పీవోకేను భారత్‌లో విలీనం చేయాలి : బ్రిటన్ ఎంపీ



విశ్వం వాయిస్ న్యూస్ : జమ్మూ కశ్మీర్‌పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ (కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకే సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని భారత ప్రభుత్వానికి సూచించారు. కశ్మీర్‌ను పాక్ ఆక్రమించడాన్ని తాను గతంలోనూ వ్యతిరేకించానని.. ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటానన్నారు. ఆర్టికల్ 370 రద్దును ఇప్పుడు కాకుండా 1992లో కశ్మీరీ పండితుల వలసల కన్నా ముందే చేపట్టాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైపూర్‌లో జరిగిన హై టీ కార్యక్రమంలో బ్రిటన్ ఎంపీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అక్రమంగా ఆక్రమించడమే కాకుండా.. పీవోకే ప్రాంతంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విస్తరిస్తుండం సరైన చర్య కాదని బాబ్ బ్లాక్‌మన్ అన్నారు. జమ్మూ కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేసుకోవాలని తాను

మిగతా .. 2లో..

## టిడిపి నాయకుడివా... వీధి రౌడీవా...!

- కమిషనర్‌ని వెంటనే సస్పెండ్ చేయాలి
- కమీషనర్ తీరుపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం
- పలు సమస్యలపై పుర కార్యాలయం ముట్టడికి యత్నం
- కార్యాలయంలోనే అడ్డుకున్న పోలీసులు
- వైసిపి కార్యకర్తలు నిరసన
- డీఎస్పీ రఘువీర్ హామీ తో ఆందోళన విరమణ
- తీవ్ర ఉద్రిక్త వాతావరణం



మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ : మండపేట పుర పాలక సంఘం కమిషనర్ టివి రంగారావు పై రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మెన్, మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంచలన వ్యాఖ్యలు చేశారు. మండపేట వైసీపీ కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మండపేట మున్సిపాల్టీలో నెలకొన్న పలు సమస్యలపై ధర్నా కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు ఇచ్చారు. ఈక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో విజయలక్ష్మనగర్‌లోని

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### నేను సంతోషంగా లేనని

# మోడీకి తెలుసు

సుంకాలు పెంచుతాము" అని ట్రంప్ పేర్కొన్నట్లు రాయిటర్స్ వెల్లడించింది. భారత్–అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న వేళ టారిఫ్‌లు పెంచుతానని ట్రంప్ బెదిరింపులు రావడం గమనార్హం. కొన్ని నెలల కిందట ప్రధాని మోదీ తనతో మాట్లాడుతూ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రకటించి ట్రంప్ సంచలనం సృష్టించారు.

# ఓఎన్జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్..

ఆరా తీశారు. మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్, అధికారులతో సీఎం మాట్లాడారు. గ్యాస్ లీక్‌పై స్థానిక అధికారులతో మాట్లాడినట్లు సీఎంకు మంత్రులు తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని చెప్పామని మంత్రులు సీఎం దృష్టికి తీస్కుళ్లారు. గ్రామస్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. మంటలను అదుపు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**ప్రజలకు మాస్కులు పంపిణీ చేయండి: అచ్చెన్నాయుడు**

ఇరుసుమండలో గ్యాస్ లీక్ ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించాలని స్పష్టం చేశారు. ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులను వెంటనే రప్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానికులు గ్యాస్ పీల్చకుండా మాస్కులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు.

# కాలుష్యంపై పోరుకు 'సముద్ర ప్రతాప్'..

అప్పగించిన సంగతి తెలిసిందే. కాలుష్య నియంత్రణకు ఉపయోగపడేలా గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించింది. సముద్ర జలాల్లో కాలుష్యాన్ని.. ముఖ్యంగా చమురు వ్యర్థాలను నిర్మూలించి జలచరాలను కాపాడేందుకు దోహదపడే అధునాతన సాంకేతికత ఇందులో ఉంది. "ఈ నౌక మన సంకల్పానికి నిదర్శనం. సాగరాల్లో కాలుష్య నియంత్రణపై దృష్టి సారించి దీనిని తీర్చిదిద్దారు. దీంతోపాటు తీర గస్తీ, సముద్ర భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నాను. ఇందులో 60 శాతానికిపైగా స్వదేశీ పరికరాలను వినియోగించాం. దేశ స్వావలంబన దిశగా ఇదొక కీలక ముందడుగు" అని రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

### మాట వినకుంటే మదురో కంటే

# ఘోరమైన గతి..

అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆమె నియామకంపై శనివారం ట్రంప్ స్పందిస్తూ.. వెనెజువెలాలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అమెరికా చేయాలనుకుంటున్న పనులను చేసేందుకు డెల్సీ సుముఖంగా ఉందన్నారు. అయితే, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె అమెరికా చర్యలను విమర్శించారు. మదురోను నిర్బంధించడం సరికాదని, ఆయనను వెంటనే వదిలేయాలని డిమాండ్ చేశారు. డెల్సీ స్పందనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "దీన్ని మేం సహించబోం. ఆమె సరైన నిర్ణయాలు తీసుకోకపోతే మదురో కంటే ఘోరమైన గతి పడుతుంది. వెనెజువెలాపై మా నియంత్రణకు ఆమె అంగీకరించాల్సిందే. అప్పుడే ఆ దేశాన్ని మేం పునర్ నిర్మించగలం. మేం కోరుకున్నది ఆమె చేస్తే.. వెనెజువెలాలో మా బలగాలను మోహరించబోం" అని ట్రంప్ హెచ్చరించారు.

**మాతో కలిసి పనిచేయండి: డెల్సీ**

మరోవైపు వెనెజువెలాతో కలిసి పని చేసేందుకు అమెరికాప్రభుత్వానికి డెల్సీ ఆహ్వానం పంపించారు. "శాంతిస్థాపనకు మేం కట్టుబడి ఉన్నాం. వెలుపలి నుంచి ఎలాంటి ముప్పు లేకుండా అంతర్జాతీయ సహకారంతో గౌరవప్రదంగా జీవించాలని మా దేశం కోరుకుంటోంది. ప్రతి దేశంలో శాంతియుత పరిస్థితులు ఉన్నప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని మేం విశ్వసిస్తున్నాం. అమెరికాతో పాటు అన్ని దేశాలతో మర్యాదపూర్వక, సమతుల్య సంబంధాలు నెలకొల్పడానికి మేం ప్రాధాన్యమిస్తాం. మా దేశ పురోగతి కోసం మాతో కలిసి పని చేసేందుకు అమెరికాను ఆహ్వానిస్తున్నాం" అని ఆమె తన సోషల్ మీడియాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

### ఏ దేశమూ

# ప్రపంచ పోలీస్ కాదు

వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. ఏ దేశమైనా ప్రపంచ పోలీసు పాత్రను పోషించలేదు. అంతర్జాతీయ న్యాయమూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షంచాలి. అన్నిదేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది" అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.

### అమెరికా ఉపాధ్యక్షుడు

# జేడీవాన్స్ నివాసంపై దాడి

ఆయన కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరని పోలీసులు ధ్రువీకరించారు. దాడి కారణంగా ఇంటి అద్దాలు పగిలాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి కారణమేంటన్నది తెలియరాలేదు.

# వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా రోడ్రిగ్జ్?

చేపట్టినట్లు తెలుస్తోంది. వెనెజువెలా చట్టాల ప్రకారం.. ఆమే బాధ్యతలు చేపట్టాలని సుప్రీం కోర్టు సూచించడం, దేశ సైన్యం ఆమెకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో రోడ్రిగ్జ్ అధికార బాధ్యతలు తీసుకున్నట్లు సమాచారం. అయితే అధికారికంగా ఎక్కడా దీనిపై ప్రకటన వెలువడలేదు. 90 రోజులపాటు ఆమె అధికారంలో ఉంటారని రక్షణ మంత్రి పాడ్రినో ప్రకటించినట్లు సమాచారం. మదురోను వదిలేయాలని అమెరికాను వెనెజువెలా ఉపాధ్యక్షురాలు, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారంటున్న డెల్సీ రోడ్రిగ్జ్ డిమాండు చేశారు. ఆయన దేశానికి చట్టబద్ధ నేతని శనివారం సాయంత్రం స్పష్టంచేశారు. 'దేశానికి ఒకరే అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనే మదురో' అని అత్యున్నత పౌర, సైనికాధికారుల మధ్య ఆమె స్పష్టం చేశారు. ఆమె మాట్లాడిన సమయంలో టీవీ ఛానళ్లలో కింద స్క్రోలింగ్ భాగంలో ఉపాధ్యక్షురాలనే వచ్చింది. మరోవైపు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో డెల్సీ రోడ్రిగ్జ్ సమగ్ర చర్చలు జరిపారని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'మీకేం కావాలో అది చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆమె దయగల వ్యక్తి. వెనెజువెలా బాధ్యతలను వేరేవారికి అప్పగించే ఛాన్స్ తీసుకోం. అది ఆ దేశ ప్రజలకు మంచిది కాదు' అని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత మచాడోకు దేశంలో పెద్దగా మద్దతు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు డెల్సీకి అమెరికాతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. చమురు పరిశ్రమలోని రిపబ్లికన్లతో, వాల్‌స్ట్రీట్‌తోనూ ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు సమాచారం. దీనినిబట్టి వెనెజువెలా అధ్యక్షురాలిగా డెల్సీ కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**మదురో తరలింపు**

అమెరికా మదురోను న్యూయార్క్‌కు చేర్చింది. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆయనను, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను నగరంలోని ఉత్తర ప్రాంతంలో ఉన్న ఓ చిన్న విమానాశ్రయానికి తీసుకొచ్చింది. వారిని తీసుకొచ్చిన విమానానికి అమెరికా జెట్లు రక్షణగా వచ్చాయి. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మన్‌హటన్‌కు తరలించారు. అక్కడ వేచి ఉన్న కాన్వాయ్‌తో మదురోను అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి తీస్కుళ్లారు. ఈ ఇద్దరిపై 'నార్కో–టెర్రరిజం' అభియోగాలను మోపిన అమెరికా.. బ్రూక్లిన్ జైలులోనే విచారించి శిక్ష విధించనుంది. శ్వేతసౌధం విడుదల చేసిన వీడియోలో మదురో నవ్వుతూ కనిపించారు. అమెరికా అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక (శనివారం తెల్లవారుజామున) వెనెజువెలా రాజధాని కారకాస్‌లో అమెరికా చేసిన దాడిలో పౌరులు, సైనికులతోసహా కనీసం 40 మంది మరణించారని ఓ మీడియా సంస్థ తెలిపింది.

మదురో, ఆయన భార్య సిలియాపై నార్కో–టెర్రరిజం కుట్ర, కొకైన్ దిగుమతి, మెషీన్ గన్స్, విధ్వంసకర ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలను మోపుతున్నారు. డ్రగ్స్ రవాణా చేసేవారి కిడ్నాప్‌లు, దాడులు చేయడంవంటి కేసులనూ పెట్టారు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని హింసించేవారని అభియోగాలు మోపారు. అమెరికా ఆపరేషన్ చట్టబద్ధతపై న్యాయ నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా చేయడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని న్యాయ నిపుణుడు ఇలాన్ కట్జ్ అభిప్రాయపడ్డారు. వెనెజువెలా పడవలపై దాడులు చేయడాన్ని ఇప్పటికే అమెరికా కాంగ్రెస్‌లోని రెండు పార్టీల సభ్యులు ఖండించారు. ఇప్పుడు వారికి తెలియకుండా విరుచుకుపడటం, అధ్యక్షుడిని తీసుకురావడంపై ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అమెరికా తమపై దాడి చేసి ఉండవచ్చుగానీ తాము చీలిపోలేదని రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో వ్యాఖ్యానించారు. 'ఈ ఎలుకలు దాడి చేశాయి. తాము చేసిన పనిపై ఏదో ఒక రోజు చింతిస్తారు' అని హోం మంత్రి స్పష్టం చేశారు. వెనెజువెలాపై దాడుల నేపథ్యంలో కరీబియన్ ప్రాంతంలో వందల విమానాలకు అంతరాయం కలిగింది. శనివారం రోజు ఏ ఒక్క విమానమూ వెనెజువెలా మీదుగా వెళ్లలేదు.

**నేడు ఐరాస భద్రతా మండలి భేటీ**

అమెరికా దాడులపై చర్చించేందుకు సోమవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం కానుంది. అత్యవసరంగా సమావేశం కావాలని కొలంబియా చేసిన విజ్ఞప్తితో ఈ సమావేశం ఏర్పాటైంది.

**దేశంలో భయం.. భయం**

తమ భవిష్యత్తుపై వెనెజువెలా వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం కారకాస్ వీధులు బోసిపోయాయి. దుకాణాలు, పెట్రోలు బంకుల వద్ద భారీ క్యూలు మాత్రం కనిపించాయి. వైమానిక దాడుల్లో కీలక మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు దెబ్బతినడంతో అనేక ప్రాంతాల్లో కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కారకాస్‌లోని భారతీయుడు సునీల్ మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ.. 'భారీ నష్టం జరిగింది. దాడి అనంతరం సూపర్ మార్కెట్లు మూసేశారు. చిన్న దుకాణాలు తెరిచి ఉన్నాయి. వాటి ముందు పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు. ప్రజా రవాణా సేవలు నిలిచిపోయాయని తెలిపారు.

**ఎవరీ డెల్సీ రోడ్రిగ్జ్?**

వెనెజువెలా రాజధాని కారకాస్‌లో 1969లో డెల్సీ రోడ్రిగ్జ్ జన్మించారు. ఆమె వామపక్ష గెరిల్లా నాయకుడు జార్జ్ అంటోనియో కుమార్తె. ఆయన పోలీసు కస్టడీలోనే మరణించారు. గతంలో మదురో ప్రభుత్వంలో కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా విధులు నిర్వర్తించిన రోడ్రిగ్జ్ 2018లో ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక, చమురుశాఖల మంత్రిగానూ పనిచేస్తున్నారు. చమురు కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ.. వెనెజువెలాను ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయటంలో ఆమె కృషి చేశారు. మదురోకు విశ్వసనీయురాలిగా ఉన్నారు.

# గ్యాస్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీ హరీష్ బాలయోగి

లీక్ ఘటన ప్రాంతానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి చేరుకున్నారు. ఓ ఎన్ జీ సి అధికారులను, ప్రభుత్వ అధికారులను అప్రమత్తం చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం తగు సహాయక చర్యలు చేపట్టిందని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# మండలిలో కవిత కంటతడి

మనస్ఫూర్తిగా పనిచేశా. పార్టీలో ప్రశ్నిస్తే నాపై కక్షగట్టారు. అక్కడే అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోతే రాష్ట్రంలో ఎలా ఉంటుంది? పార్టీ నన్ను ఘోరంగా అవమానించింది. ఈడీ, సీబీఐలతో పోరాడేటప్పుడు నాకు అండగా నిలవలేదు. కేసీఆర్‌పై కక్షతో భాజపా నన్ను జైలులో పెట్టించింది. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను"అని కవిత అన్నారు.

**వచ్చే ఎన్నికల్లో 'జాగృతి' పోటీ**

ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. "ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. నాది ఆస్తుల పంచాయతీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళు న్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా" అని కవిత వ్యాఖ్యానించారు.

### తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో

# ఎన్డీయేదే విజయం

మంత్రులపై అవినీతి కేసులున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్నా 20 శాతం కమీషన్ డీఎంకే నేతలకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మరోవైపు మహిళలకు భద్రత లేదని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, నర్సులు వీధుల్లోకి వచ్చి తమ డిమాండ్ల కోసం పోరాడే పరిస్థితి నెలకొందని విమర్శించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమిళ భాషాభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# పీవోకేను భారత్‌లో విలీనం చేయాలి : బ్రిటన్ ఎంపీ

అనేకసార్లు సూచించినట్లు తెలిపారు. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతుండడంతో అక్కడ శాంతి నెలకొందని తాను భావించానని.. కానీ పహల్గాం దాడితో ఉగ్ర సమస్య మళ్లీ వెలుగులోకి వచ్చిందన్నారు. భారత సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని విస్తరిస్తే ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉంటుందని.. పాక్‌ను హెచ్చరించారు.

# టిడిపి నాయకుడివా... వీధి రౌడీవా...!

వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, పుర పాలక సంఘం కార్యాలయ ముట్టడి కి బయలుదేరారు. ఈ నేపద్యంలో టౌన్ సి ఐ సురేష్, రూరల్ సి ఐ దొర రాజు లు పోలీసులు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. శాంతి భద్రత సమస్య తలెత్తుతుందనీ ఇక్కడ నుండి వెళ్లకూడదని అడ్డుకున్నారు. వారి తో తోట త్రిమూర్తులు మాట్లాడుతూ డాక్టర్ బి అర్ అంబేడ్కర్ రాజ్యాంగం ప్రకారం తను హక్కులు ప్రశ్నిస్తుంటే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. తాను లేవనెత్తిన సమస్యలు ప్రజల కోసం అని పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో నిలువ నీడ లేని రిక్ష కార్మికులకు బస్ స్టాండ్ లో షెల్టర్ నిర్మిస్తే అక్కడ ఉన్న బోర్డు కమీషనర్ టివి రంగారావు అన్యాయం గా తొలగించారని ఆరోపించారు. అక్కడ బోర్డు పై మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటో తో ఉన్న బోర్డు స్థానం లో టీడీపీ బోర్డు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనిపై పలు మార్లు ఫిర్యాదు చేసినా కమీషనర్ తీరు మారలేదని తప్పుపట్టారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రాము కు చెందిన భవనాన్ని అక్రమంగా కూల్చే యత్నం కమీషనర్ చేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం నాయకుడివా, లేదా వీధి రౌడీవా అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల పాటి మీద అన్ని అనుమతులు తో వైసిపి నాయకులు కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే దౌర్జన్యంగా తొలగించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ఆగడాలు విపరీతంగా పెరిగి పోయాయని విమర్శించారు. వల్లూరు లో అక్రమ చెరువులు తవ్వి మట్టి నీ తరలిస్తున్నారని ఆరోపించారు. ఇసుక మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు అడ్డు అదుపు లేకుండా జరుగుతున్నాయని విమర్శించారు. సంబంధిత అధికారులు ఏమైపోయారని తోట ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం లో ఇటువంటి అరాచకాలు లేవన్నారు. విలువైన మున్సిపాల్టీ వాటర్ వర్క్స్ స్తలం కబ్జా కు గురైతే కమీషనర్ ఆ కబ్జా ను ప్రోత్సహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెత్తినట్టు కమిషనర్ వ్యవహారం కొనసాగుతుందని గుర్తు చేశారు. దీనికి బాధ్యత వహించి వెంటనే కమిషనర్ను సస్పెండ్ చేయాలని తోట ఉద్ఘాటించారు. టిడిపి కి తొత్తుగా వ్యవహరించి ప్రోటోకాల్ పాటించడం లేదని కమీషనర్ తీరు ను దుయ్యబట్టారు. ప్రభుత్వ అధికారిగా కాకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు కమిషనర్ పేరుపై ఉన్నతాధికారులు స్పందించకపోతే వైసీపీ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉంటాయని పేర్కొన్నారు. కనీసం శిలాఫలకాలు పై కౌన్సిలర్ ల పేర్లు కమీషనర్ వేయడం లేదని పేర్కొన్నారు. రేషన్ అక్రమ రవాణా కు అంతూ పొంతూ లేకుండా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఎవరికి అమ్మాలి ఏ రైస్ మిల్లుకు పంపాలో అన్నది కూడా ముందుగానే డీలర్లకు చెప్పి మరి రైసును రవాణా చేయడం ఇంతకంటే దారుణం ఉంటుందని తోట ప్రశ్నించారు. కొందరు రేషన్ డీలర్ లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కార్యాలయం నుండి పోలీసులు అడ్డగిస్తున్న రోడ్ పైకి వచ్చారు. పోలీసులు ఆయన ను అరెస్ట్ చేసి జీపులో తీసుకొని వెళ్లాలని తీవ్ర యత్నం చేశారు. కార్యకర్తలు ఆయన కు వలయం లా ఏర్పడి పోలీసులు ప్రయత్నాన్ని అడ్డు కొన్నారు. అక్కడే లాగులాట జరిగింది. పోలీసులు కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ నేపద్యంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ అక్కడికి చేరుకున్నారు. సెక్షన్ 21 అమలు లో ఉందని ఎటువంటి కార్యక్రమాలకు అనుమతి లేదని తోట కు తెలిపారు. పలు అంశాలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు లేవనెత్తారు. కాగా 15 రోజుల వ్యవధి లో అధికారులతో మాట్లాడి చట్ట ప్రకారం సమస్యల పరిష్కార కోసం కృషి చేస్తానని డీఎస్పీ రఘువీర్ హామీ ఇచ్చారు. దీంతో తోట ఆందోళన విరమించి తన కార్యాలయం లోకి వెళ్లిపోయారు. ఈ గడువు లోగా సమస్య పరిష్కారం కావాలని లేని పక్షంలో మునిసిపల్ కార్యాలయ ముట్టడి మహాధర్నా నిర్వహిస్తానని తోట త్రిమూర్తులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి పాపారాయుడు ,వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ, దూలం వెంకన్న బాబు, ఓగిరాల దేవి, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, మీగడ శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, పెద్దపాటి సత్యనారాయణ, టౌన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్,మందపల్లి రవికుమార్ ,వైసిపి నాయకులు, కౌన్సిలర్లు ఎంపీటీసీ లు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం..

వారి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. కృష్ణ కిశోర్ దశాబ్ద కాలానికి పైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆ దంపతులు 10 రోజుల క్రితం పాలకొల్లు వచ్చి తిరిగి వెళ్లారు. మార్గంమధ్యలో దుబాయ్‌లో న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. వీరి మృతితో పాలకొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

# మన ఉనికిని కోల్పోయినట్లే..

హాజరుకావడం తెలుగు భాష గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఆధునిక తెలుగు భాషకు పితామహుడైన గిడుగు వెంకట రామ్మూర్తి సేవలను తెలుగు జాతి ఎప్పటికీ మరువదని చంద్రబాబు కొనియాడారు. "నేను తెలుగువాణ్ణి.. నాది తెలుగుదేశం" అని గర్వంగా ప్రకటించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని ప్రశంసించారు. 1985లోనే ఎన్టీఆర్ ముందుచూపుతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లో స్థాపించారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత అదే స్ఫూర్తితో రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే భాషను మరింత సులభంగా పరిరక్షంచుకోవచ్చని సీఎం సూచించారు. కొత్త యాప్‌లు, వాయిస్ టెక్నాలజీ ద్వారా తెలుగులో మాట్లాడినా సమాధానాలు లభిస్తున్నాయని, టైప్ చేయడం రాని వారు కూడా భాషను వినియోగించుకునే అవకాశాలు పెరిగాయని తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షంచి భావి తరాలకు అందించేందుకు ఇలాంటి ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో దోహదపడతాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. జనవరి 3న ప్రారంభమైన ఈ మహాసభలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగాయి. ప్రపంచ నలుమూలల నుంచి తెలుగు భాషాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 06 డిసెంబర్ 2025

www.viswamvoice.com






వ్యవసాయ భూములు..

# కనుమరుగైపోతున్నాయి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి పరిసర ప్రాంతాలు పచ్చటి పైరును చీరగా చుట్టుకున్న పాడిపంటలతో అలారరూతు..చూడటానికి ఎంతో ఆనందంగాను.. ఆహ్లాద్ధంగాను వుండేది. రెండు పంటలు ఇచ్చే పంట భూములు.. ఏడాది పొడవున ఎప్పుడు చూసిన పచ్చటి పైరుతోనో.. వరి కంకులతోనో వినుల విందుగా..మనసుకి ప్రశాంతంగా ఉండేది. అటువంటి పంట భూములు కనుమరుగ పోతున్నాయి. కడుపునింపే భూమాతని.. కనుమరుగు చేస్తున్నారు. ఇళ్ల స్థలాలుగా మార్చేస్తున్నారు.. పంట భూమిని, చేపల చెరువులు,రియల్ ఎస్టేట్ వెంచర్లుగాను మార్చి వ్యాపారం చేస్తున్నారు. రాజమండ్రి పరిసర గ్రామాలు చూస్తే ఈ మధ్యకాలంలో నిన్న.. మొన్నటి దాక కనిపించే పచ్చటి పంట భూమి.. నేడు ఇళ్ల స్థలాలుగా మారిపోతున్నాయి. పంటభూములు కనుమరుగై పోతున్నాయి. పంటభూమిని ఇళ్ల స్థలంగా మార్చటం అంటే మాటలు కాదు.. మరీ రెండు పంటలు పండే భూములను.. ఇళ్ల స్థలాలుగా మారుస్తుంటే.. అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారు.. అని పలువురు మొర పెట్టుకుంటున్నారు. రేపటి తరాలకు పాడి పంటలను పుస్తకాలలో చూపించే పరిస్థితి వస్తుందేమో అని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు, నాయకులు పాడిపంటలను పరిరక్షించాలని.. అందుకు గాను కఠినమైన చట్టాలు చెయ్యాలని.. రేపటి తరాల తలరాతలు.. పాడిపంటలని గుర్తించాలని పలువురు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు.

తప్పుడు బిల్లులతో

# అవినీతి భాగోతం



**డీఆర్డీఏ సెర్ప్ ఐబి అధికారి తీరుపై గగ్గోలు - తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా డిఆర్డిఏ-సెర్ప్ ఇన్స్టిట్యూషన్ బిల్డింగ్ (ఐబి) అత్యంత కీలకమైన శాఖ దీని ద్వారా జిల్లాలో ఉన్న అన్ని డ్వాక్రా సంఘాలకు శిక్షణలు ఇవ్వడం నిధులు రప్పించడం ఆ నిధులు వాళ్ళకి కేటాయించడం మొదలగు వ్యవహారాలు చూస్తుంది.ఐబి కంట్రోల్ లోనే జిల్లా సమాఖ్య వ్యవస్థ అంతా నడుస్తుంది. ఈ విభాగం శిక్షణలో అవినీతి భాగోతం అంటూ పలువురు గగ్గోలు పెడుతున్నారు. మండల స్థాయి శిక్షణ లంటూ తప్పుడు బిల్లులు పెట్టి వంద రూపాయలు ఖరీదు చేయని భోజనాన్ని సుమారు రూ 200, 300. పేరిట ప్రభుత్వ అధికారులు దొంగబిల్లులు పెడుతూ అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. పైగా ఈ తప్పుడు బిల్లులకి సహకరించని క్రింద స్థాయి అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ, వేధిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కావున అధికారులు ఐబి శిక్షణా ఖర్చులపై పూర్తి దర్యాప్తు చేసి ప్రభుత్వ సొమ్మును కాపాడవలసిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని పలువురు కోరుతున్నారు. సదరు ఐబి జిల్లా అధికారి గత కొన్ని ఏళ్లగా అధికారులను మేనేజ్ చేస్తూ ఇదే జిల్లాలో తిష్ట వేసి ఆర్థిక నేరాలుకు పాల్పడుతున్నాడని ఇప్పటికైనా గుర్తించి, ఉన్నతాధికారులు అధికారులు దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# దేవుడు ఇక లేడు... దేవుడు వెళ్ళిపోయాడు... !!!

## తమ్మయ్యబాబు మృతితో లింగంపర్తిలో విషాదం





**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ మాజీ ఇన్చార్జ్, ఏలేశ్వరం మండల మాజీ ఎంపీపీ, లింగంపర్తి గ్రామ వాసి వరుపుల తమ్మయ్య బాబు సోమవారం ఉదయం 11 గంటలకు గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులు, ప్రజల సందర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని ఆయన స్వగ్రామమైన లింగంపర్తిలోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోరును విలపిస్తూ పార్థివ దేహాన్ని సందర్శించారు. దీంతో లింగంపర్తి గ్రామంలోని ఆయన నివాసం వద్ద, గ్రామం, అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా కూడా విషాద ఛాయలు అలుము కున్నాయి. వరుపుల మృతిని ఆయన అభిమానులు, కార్యకర్తలు, నాయకులూ జీర్ణించుకోలేక పోతున్నారు. ఇచ్చిన మాటపై నిలబడి కులాలు, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా కార్యకర్తలకు అండగా నిలుస్తారని పేరున్న నాయకుడైన తమ్మయ్యబాబు వల్ల మేలు పొందిన వారు మరణ వార్త విని లింగంపర్తి చేరుకుని దేవుడు ఇక లేడు... దేవుడు వెళ్ళిపోయాడు అంటూ ఆయన మృత దేహంపై పడి విలపిస్తూ ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన తమ్మయ్య బాబుకు ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు చిన్నాన్న కొడుకు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమీప బంధువు, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ వీరి కుటుంబంలోని వ్యక్తి, అలాగే కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి ఈయనకు తోడు అల్లుడు, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తమ్మయ్య బాబుకు సమీపు బంధువు, పర్వత, ముద్రగడ, తోట కుటుంబాలతో బంధుత్వాలు ఉన్నాయి. కాగా కార్యకర్తలకు న్యాయం చేసేందుకు దూసుకుపోయే స్వభావం గల వ్యక్తి కావడంతో ఇటీవల ప్రత్తిపాడు ఆసుపత్రి సంఘటనతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. కానీ ఇప్పటి వరకు ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పదవిని ఇంకా ఎవరికీ కట్టబెట్టలేదం. బహూశా ఆయన మీద గౌరవంతో ఆ పదవిని తిరిగి ఆయనకు ఇచ్చేందుకేనని కొందరు విశ్లేషకులు అంటున్నారు. కాదు... కాదు ... ఆయనకు రాష్ట్ర స్థాయిలోని పార్టీ పదవిని కట్టబెట్టేందుకు పార్టీ కసరత్తు చేస్తున్నదని, ఆ క్రియాశీలక కార్యాచరణ తుది దశకు చేరుకున్నదని, ఇంతలోనే ఈ విధంగా తీరని విషాదం జరిగి పోయిందని మరి కొందరు విశ్లేషించారు. వరుపుల తమ్మయ్యబాబుకు తిరిగి పార్టీ పునఃస్వాగతం పలికేందుకు, రాష్ట్ర స్థాయి పార్టీ పదవిని కట్టబెట్టేందుకు సానుకూల వాతావరణం ఏర్పడిందనే వార్తా ఆలోచనలతో నేటి ఉదయం 10 గంటలకు దంతధావనం, ముఖమజ్జనం చేసుకుంటూ ఉండగా ఊహించని రీతిలో హఠాత్తుగా గుండె పోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ వైద్యుని వద్ద వరుపుల తమ్మయ్యబాబును చూపించారు. ఆయనను కాకినాడలోని మంచి ఆస్పత్రికి వెంటనే తరలించాలని ఆ ప్రైవేట్ వైద్యుడు సూచించడంతో సామర్లకోట మీదుగా కాకినాడకు తరలిస్తుండగా సామర్లకోటలోనే పేదల దేవుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు.

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో పాల్గొన్న

# ఏజిపి,ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ బూసి విద్యా ప్రసన్న



**కొత్తపేట/ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా ఉపాధ్యాయనిలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే ఏజిపి మరియు ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ బూసి విద్యా ప్రసన్న స్థానిక చెముడు లంక హై స్కూల్ నందు ఆలమూరు మండల యుటిఎఫ్ సంఘం ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి అబశ్రీశ్రీ ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఆలమూరు మండలం ఎంఈఓ 2 ఎన్. రాజు ముఖ్యఅతిథిగా విశిష్ట అతిథిగా బూసి విద్యా ప్రసన్న హాజరైనారు. మరియు ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శివరామకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి బూసి విద్యా ప్రసన్న మాట్లాడుతూ ఈనాటి మహిళా ఉపాధ్యాయునిలకు సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శమని మరియు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం ఉపాధ్యాయులు పనిచేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలమూరు మండల స్థాయి ఉత్తమ మహిళ ఉపాధ్యాయ రాలగా చెముడులంక హై స్కూల్ నుంచి సీనియర్ ఉపాధ్యాయురాలు అయినటువంటి అవసరాల శేషు లక్ష్మకాంతం మరియు ప్రాథమిక పాఠశాల నుండి జీ.వాణి ని ఈ సందర్భంగా సత్కరించడం అయింది. అలాగే ఈ వేడుకలో ఏజీపీ బూసి విద్యా ప్రసన్న ని కూడా వారి సేవలు ను గుర్తించి సత్కరించమైనది టీచర్లు మంచి ఆసక్తిగా హుషారుగా పాటలు పాడి కార్యక్రమాన్ని దిగ్విజంగా నడిపించారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షులు జి.పుత్ర కుమార్ ,ప్రధాన కార్యదర్శి దాసరి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి ఎస్ సత్యవేణి, మహిళా కార్యవర్గ సభ్యులు బిఎన్విఎల్ చైతన్య, పి.బాల ప్రసన్న, ఏక్ ఏ.ఖాన్, జి జోగేశ్వరరావు, వైవి విరమణ, ఈ రమేష్ జి అఖిల మరియు చెమటలంక హై స్కూల్ నుండిమహిళా ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయవాదుల హక్కులను గెలిపించిన ఘనత

# ఎంవి రాజారామ్ దక్కుతుంది..

ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ పత్రిక ప్రకటన జారీచేశారు. మేడా మాట్లాడుతూ ప్రశ్నించే న్యాయవాదుల గొంతును నొక్కాలనే కుట్రతో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే న్యాయవాద అభ్యర్థులు రూ. 1లక్ష 25వేలు దారావత్తు చెల్లించాలి అనే నిబంధనను సీనియర్ న్యాయవాది ఎమ్. వి రాజారామ్ ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా) తరుపున న్యాయ పోరాటం చేసి తన ప్రతిభతో న్యాయవాదుల హక్కును, స్వేచ్ఛను వాజ్యం నెం : 29216/2025 ద్వారా 50,000 రుసుము చెల్లుంచుటకు న్యాయవాదులకు అనుకూలంగా ఈ రోజు న్యాయమూర్తుల ఆదేశాల మేరకు విజయం సాధించారు.సీనియర్ న్యాయవాది ఎమ్.వి. రాజారామ్ కు ప్రతి జిల్లా నుండి న్యాయవాదులు అభినందనలు తెలిపారు. రాజమండ్రి నుండి బార్ కౌన్సిల్ మెంబెర్ గా పోటి చేస్తున్న డి.వి.వి.త్రినాద్ , విజయనగరం న్యాయవాది పి. భాగ్యరాణి,రాజమండ్రి నుండి మరో న్యాయవాది ఏ వి ఎల్ నరసింహారావు , విశాఖపట్నం నుండి దాడి మమతా వర్మ ,జగన్నాద సూర్య ప్రభావతి ,తణుకు నుండి ఓ.ఎన్.కృష్ణ . గుంటూరు నుండి అవధానుల హరి , విజయవాడ నుండి ఆళ్ళ శ్రీహరి, తిరుపతి నుండి ఉడుం స్వాతి ,కడప నుండి మల్లిఖార్జున రావు , కాకినాడ నుండి కట్టా ప్రతాప్ కుమార్ , ముమ్మిడివరం నుండి బొండా వెంకట సుబ్రహ్మణ్యశ్వరరావు , అమలాపురం నుండి మనోజ్ వంటి ఎందరో న్యాయవాదులు రాష్ట్రం నలుమూలల నుండి శ్రీ రాజారామ్ కు ఫోన్ ల ద్వారా అభినందనలు తెలియచేసిన వారిలో వున్నారు . ఈ విజయం న్యాయవాదుల విజయంగా బావించాలి..బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రాజారామ్ ను అత్యధిక మెజార్టీ తో గెలిపించుకుంటే న్యాయవాదులకు మరిన్ని విజయాలు దరికి చేరుస్తారని,న్యాయవాదుల భద్రత,సంక్షమం,అభివృద్ధి రాజారామ్ తోనే సాధ్యం అని న్యాయవాదులు బావించి రాజారామ్ విజయానికి యావత్ ఆంధ్ర రాష్ట్ర న్యాయవాదులు అందరరూ కృషి చేయాలని శ్రీనివాస్ కోరారు.

# స్వచ్ఛ సంక్రాంతి గ్రామసభలో మత్సేటి శివసత్య ప్రసాద్




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం పిలుపు మేరకు రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం సోమవారం ఉదయం బొమ్మూరు గ్రామపంచాయతీ వద్ద పంచాయితీ కార్యదర్శి కాశి విశ్వనాథ్ ఆధ్వర్యంలో గ్రామసభలో పాల్గొన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మత్సేటి శివసత్య ప్రసాద్, ఏపీఓ భీమరశెట్టి రమేష్ కుమార్, కామిని భాస్కర్,పిల్లా తనుజ,పితాని రాజు, రాయుడు సునిల్, కంచర్ల వెంకటలక్ష్మ, తూర్పు గోదావరి జిల్లా పార్లమెంట్ ఎస్సీ సెల్ నాయకులు పి.సురేష్ కుమార్, జన సేన నాయకులు అడ్డాల శ్రీనివాస్, యార్లగడ్డ సునిల్, పల్లెడ పైడినాయుడు, కోట్ల దుర్గరావు, సాయి, పంచాయతి సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు జననం సర్వ మానవాళి రక్షణకు మూలం

**రాయవరంలో ఘనంగా యువ చైతన్య యూత్ క్రిస్మస్ వేడుకలు**

**ముఖ్య అతిథిలుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ రామకృష్ణ, ఫణి కృష్ణారెడ్డి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** యేసు క్రీస్తు జననం సర్వ మానవాళి రక్షణకు మూలం అని, ఆయన కేవలం కొన్ని సంవత్సరాల క్రితం పుట్టినవారు కాదని, జగత్తుకు పునాది వేసిన దేవుడని బ్రదర్. సాల్మన్ గుప్త క్రిస్మస్ సందేశం గా వివరించారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో యువ చైతన్య యూత్ సభ్యులు సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో సాల్మన్ గుప్తా ముఖ్య ప్రసంగీకులుగా హాజరయ్యారు. తొలుత సంగీత, గీతాలాపన లతో ప్రారంభమైన క్రిస్మస్ వేడుక కార్యక్రమాలు స్థానిక దైవ సేవకుల శుభాకాంక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక ను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రాయవరం గ్రామ సర్పంచ్ చంద్లమళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుండి యువకులైన వారు తరాలు మారుతున్నా, తరువాతి తరాలు ఈ యూత్ క్రిస్మస్ వేడుకలను కొనసాగించడం అభినందనీయమని, యువకులు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని సేకరించి, వృద్ధులు, వితంతువులకు సహాయం అందించడం క్రీస్తు ప్రేమకు నిదర్శనం అన్నారు. అనంతరం ముఖ్య వర్తమానికులుగా హాజరైన సాల్మన్ గుప్తా ప్రసంగిస్తూ ప్రపంచంలో ఖచ్చితమైన ఆధారాలు కలిగిన దేవుడు యేసు క్రీస్తని, దీనులను, పామరులను ఆయన ఎన్నుకుని పండితులను చేసారన్నారు. ఆయన జననం నుండి మరణం వరకూ అందరినీ ప్రేమించారని, శత్రువులను ప్రేమించడం నేర్పించిన దేవుడు ఏసుక్రీస్తుని కొనియాడారు. యేసు క్రీస్తు జననం సర్వ మానవాళి రక్షణకు మూలం అని, ఆయన కేవలం కొన్ని సంవత్సరాల క్రితం పుట్టినవారు కాదని, జగత్తుకు పునాది వేసిన దేవుడని వివరిస్తూ తన జీవితంలో క్రీస్తు వైపు ఆకర్షింపబడిన పలు సందర్భాలను వివరించారు. అనంతరం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక దైవ సేవకులకు సన్మాన సత్కారాలు నిర్వహించారు. కార్యక్రమం నిమిత్తం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి సహకారంతో, ఆయన చేతుల మీదుగా బహుమతులు అందించి ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఫణి కృష్ణారెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీస్తు లా జీవితం సమాజం సేవకు ఉపయోగించాలని సూచించారు. అనంతరం స్థానిక యువకులు బైబిలు గ్రంథము లోని సంఘటనలను నాటికల రూపంలో ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళ వారం స్థానికంగా భారీ అన్న వితరణ జరగనున్నట్లు యూత్ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దైవ జనులు . అబ్బులు, టి.నతానియేలు, ఎల్.రాజు, మహిమానంద రెడ్డి, ఇస్సాకు, గిరిబాబు, జాన్ బాబు, సురేష్, కిషోర్, ఎమ్. అబ్బులు(రాజులు), స్థానిక యువచైతన్య యూత్ పెద్దలు, యువకులు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కూటమి పాలకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సొంత రాజ్యాంగం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వ మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ రెడ్ బుక్ తో కూడిన సొంత రాజ్యాంగాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల అండదండలతో ఎదేచ్ఛగా ఆచరణ చేస్తున్నారని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. మండపేట ప్రజలకు మంచి వైద్య సేవలు అందిస్తూ గవర్నమెంట్ డాక్టర్ గా మంచి మనిషిగా పేరు తెచ్చుకున్న ఆర్థోపెటిక్ స్పెషలిస్ట్ సీనియర్ డాక్టర్ .రాము మరింత మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని తన ఉద్యోగానికి రాజీనామా చేసి మన మండపేట లోనే ఒక స్థలాన్ని కొనుగోలు చేసి ఆసుపత్రిని కట్టి వైద్యం చేస్తున్నటువంటి ఆస్పత్రికి ప్రజాదారణ ఎక్కువగా ఉన్న కారణంగా మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో అక్కడ అవసరమైనటువంటి అన్ని అనుమతులను ఇప్పించడం బిల్లింగ్ కట్టుకోవడం జరిగింది, కొంతకాలానికి పేషెంట్స్ ఎక్కువగా రావడంతో మరొక ఫ్లోర్ వేసి ఇబ్బంది లేకుండా చేయడం కోసం మీ గవర్నమెంటు ప్రస్తుతం అధికారంలో ఉన్నందున కూటమి శాసన సభ్యులుగా ఉన్న జోగేశ్వరరావు వద్దకు వెళ్లి అడుగగా మీరు వేసుకోండి అని చెప్పిన పిదప డాక్టర్ రాము సుమారు 20 లక్షలు విలువ చేసే బిల్డింగ్ మెటీరియల్ తో పనులు మొదలుపెట్టుకున్న తరుణంలో తెల్లవారుజామున 50 మంది మున్సిపల్ సిబ్బందితో వెళ్లి కట్టుకుంటున్న ఆ బిల్డింగ్ ని కూల్చివేయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న డాక్టర్ మున్సిపల్ సిబ్బంది చేస్తున్న అత్యుత్సాహక చర్యలను ఖండిస్తూ స్థానిక ఎమ్మెల్యే చెప్పారు అని చెప్పి జోగేశ్వరరావు గారికి ఫోన్ చేసి చెప్పగా నేను మాట్లాడతాను అని చెప్పి తిరిగి మళ్ళీ ఫోన్ చేసి కమీషనర్ నా మాట వినటం లేదు మంత్రివర్యులు నారాయణ కొత్త పాలసీ తెచ్చారు అంటున్నారు అని చెప్పడం ప్రజా ప్రతినిధిగా వేగుళ్ల విజ్ఞత అని అన్నారు. అనంతరం డాక్టర్ కోర్టును ఆశ్రయించి ఆర్డర్ కాపీతో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయించారంటే ఎంత దౌర్జన్యంగా ఉద్యోగాలు చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఒక బిల్డింగ్ అనధికారికంగా కట్టి ఉంటే నోటీసులు ఇచ్చి పై అధికారుల అనుమతితో నేలమఠం చేయాలి కానీ ఎటువంటి అనుమతులు లేకపోయినా సొంత అజెండాతో రాజకీయ నాయకుడిలా ప్రవర్తిస్తున్నారు కాబట్టే కోర్టుళ్ళడం జరిగిందని తోట విమర్శించారు.

# బిజెపి ప్రజా సమస్యలు పరిష్కార వేదిక జనతా వారధి

**పీజీఆర్ఎస్‌లో బిజెపి నేతలు పలు సమస్యలు ప్రస్తావన**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాల సమస్యలను పి జి ఆర్ ఎస్ ద్వారా బిజెపి జిల్లా అధ్యక్షులు పీక్కి నాగేంద్ర నేతృత్వంలో జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుళ్లారు.బిజెపి జనతా వారధి నేటి నుంచి ప్రారంభం సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య బిజెపి నాయకులు వారదులుగా పని చేస్తారని తెలిపారు. ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీశ్రీనివాస్ లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ మండల స్థాయిలో పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటుందని బిజెపి ప్రజావారధితో ప్రజల విజ్ఞాపనలు ప్రతి సోమవారం ప్రభుత్వం ద్వారా పరిష్కరించే కార్యక్రమం చేస్తుందని ప్రజలతో కలసి బిజెపి ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా భాజాపా కార్యకర్తలు పని చేస్తారని తెలిపారు రాజమండ్రి హెూమియోపతి ఆసుపత్రిలో సమస్యలు, మురుగు కాల్వల సమస్యలు రాజమండ్రి రూరల్ లో పరిశుధ్యం పై తొర్రేడు జగనన్న కాలనీ లో మౌలిక వసతులు, కొవ్వూరులో శిథిలావస్తలో టిట్కో ఇండ్లు, గోపాలపురం నియోజకవర్గంలో రైతు సమస్యలు రాజానగరం లో సీసీ రోడ్లు రంగంపేటలో మురుగు కాల్వల అభివృద్ధి కోసం వినతిపత్రాన్ని ఇచ్చామని త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ బిజెపి విస్తృత కార్యాచరణ చేసిందని ప్రజలకు ప్రభుత్వ అధికారులకు మధ్య బిజెపి శ్రేణులు వారధిగా ఉన్నారని అన్నారు. ప్రతి శుక్రవారం భాజాపా జిల్లా కార్యాలయంలో అన్ని రకాల ప్రజా సమస్యలు స్వీకరించి ప్రజల పక్షన బిజెపి నిలబడి పని చేస్తుందని చెప్పారు. ప్రజలు భాజపా తో కలసిరావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురగంటి సతీష్, యానాపు ఏసు ఎమ్.ఎస్.ఆర్..రాజు మద్దిపాటి రజని, తగరం సురేష్,ఎన్.వి.బి.ఎన్. ఆచారి,వీర వీరాంజనేయులు,అధికారి లక్ష్మ, మోహిని,తంగెళ్ళ శ్రీనివాస్, నందివాడ సత్యనారాయణ,టేకి శంకర్ వెంకట్,మీనాక్ష , దాసరి సుబ్బారావు,కుబేర రావు, అంబళ్ళ నాగరాజు, మౌనిక,తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## రేవంత్ మాటలు వైసీపీకి ప్రియం..

హరీష్ కామెంట్స్ టీడీపీకి సుఖం తెలంగాణా రాజకీయం కాస్తా ఏపీ రాజకీయాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అక్కడ రాజకీయ ప్రకంపనలు పుడితే ఏపీలో రీ సౌండ్ చేస్తోంది. రేవంత్ మాటలు వైసీపీకి ప్రియం...హరీష్ కామెంట్స్ టీడీపీకి సుఖం తెలంగాణా రాజకీయం కాస్తా ఏపీ రాజకీయాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అక్కడ రాజకీయ ప్రకంపనలు పుడితే ఏపీలో రీ సౌండ్ చేస్తోంది. దానికి కారణం అక్కడా ఇక్కడా అధికార ప్రతిపక్షలు ఉప్పూ నిప్పుగా ఉండడమే. ఇక తెలంగాణాలో అధికార పక్షం కాంగ్రెస్ అయినా సీఎం రేవంత్ రెడ్డి పూర్వాశ్రమంలో టీడీపీలో కీలక నేత పైగా వర్కింగ్ ప్రెసిడెంట్ గా పనిచేసిన వారు. ఫైర్ బ్రాండ్ అన్న ముద్ర టీడీపీలోనే ఆయనకు వచ్చింది. ఆయన ఎంత కాంగ్రెస్ మనిషి అయినా ఒకనాటి తమ వారే అన్న భావన టీడీపీకి ఎక్కడో చాలానే ఉంది.

**ఈ బంధం ఏనాటితో :** ఇక వైఎస్సార్ కి కేసీఆర్ కి మధ్య అయితే పెద్దగా పొత్తు మాటే లేదు. 2004లో కాంగ్రెస్ టీఆర్ఎస్ ల మధ్య పొత్తులను కుదిర్చిన వారు నాటి కాంగ్రెస్ పెద్ద దిగ్విజయ్ సింగ్. ఆ తరువాత మధ్యలోనే పొత్తు పెటాకులు అయింది. ఇక 2009 నాటికి టీడీపీ టీఆర్ఎస్ మహా కూటమిగా పోటీ చేసి వైఎస్సార్ చేతిలో ఓటమి పాలు అయ్యాయి. అది డిఫరెంట్ స్టోరీ. ఇది పక్కన పెడితే వైఎస్సార్ తో కుస్తీ చేసిన కేసీఆర్ కి ఆయన కొడుకు జగన్ తో మాత్రం దోస్తీ కుదిరింది అంటారు. ఈ ఇద్దరినీ కలిపిన రాజకీయ పరిణామాలు చాలానే ఉన్నాయి. ఇద్దరూ కాంగ్రెస్ నుంచి వచ్చి ఆదే కాంగ్రెస్ ని శతృవు గా చూశారు. అంతే కాదు రాష్ట్రం విడిపోతే ఏపీలో జగన్ వైసీపీ రైజ్ అయింది. తెలంగాణాలో కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వచ్చింది. అలా ఇద్దరికీ ఎక్కడా పొలిటికల్ క్లాష్ అన్నది లేకపోవడం కూడా స్నేహం కుదరడానికి కారణం కావచ్చు. అలాగే ఇద్దరికీ చంద్రబాబు ప్రత్యర్ధి కావడం మరో అనుకూల భావజాలంగా ఉంది. అందుకే ఇద్దరు మిత్రులు అయ్యారు అని చెబుతారు.

**రేవంత్ మాటలతో ఖుషీ :** ఇదిలా ఉంటే నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి చంద్రబాబుని నిలదీసి ఒప్పించి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ని ఆపించాను అని బిగ్ సౌండ్ చేశారు. అంతే వైసీపీ కి అది ఎంతో ప్రియం అయిపోయింది. చెవులకు ఇంపుగా తోచింది. దాంతో వైసీపీ నేతలు అంతా రాయలసీమకు చంద్రబాబు మరణ శాసనం రాశారు అంటూ తీవ్ర విమర్శలు మొదలెట్టారు.

**టీడీపీకి సుఖంగా :** కట్ చేస్తే బీఆర్ఎస్ కీలక నేత ఆనాటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు మీడియాను ముందు పెట్టి తెలంగాణా భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో ఆయన చెప్పింది రేవంత్ రెడ్డికి పూర్తిగా ఉల్టాగా ఉంది. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అబద్ధం చెప్పారని హరీష్ రావు ఆరోపించారు. అసలు రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ ని జగన్ హయాంలోనే తాము ఆపించామని కూడా ఆయన బల్ల గుద్ది మరీ చెప్పారు. ఈ కామెంట్స్ తో టీడీపీ శ్రేణులు ఇది కదా అసలు మ్యాటర్ అని వైసీపీని కార్నర్ చేస్తున్నాయి. రాయలసీమకు అసలు ద్రోహం చేసింది వైసీపీనే అని రివర్స్ ఎటాక్ చేస్తున్నాయి. ఇంతకీ రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ ని ఆపింది ఎవరు అన్నది మాత్రం ఎవరికీ అర్థం కావడం లేదు, ఎందుకంటే వైసీపీ హయాంలో అనుమతులు లేకుండా మొదలెట్టడం వల్లనే అది ఆగిపోయింది అని టీడీపీ అంటోంది. మరి అలా ఆగిందా లేక పొరుగు రాష్ట్రం ఒత్తిళ్ల నుంచి ఆగిందా లేక ఇంకేదైనా కారణమా అన్నది మాత్రం తెలడంలేదు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

భగ్గుమన్న పాత కక్షలు..

## ఇద్దరి దారుణ హత్య



**ఎమ్మిగనూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు జిల్లాలో పాత కక్షలు భగ్గుమన్నాయి. తమ వర్గం వారిని హత్య చేశారని.. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరు మండలంలోని కందనాతిలో వెంకటేశ్ (40), పరమేశ్ (35)ను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. మరొక వ్యక్తి గోవింద్ ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వీరికి.. రెండేళ్ల క్రితం హత్యకు గురైన వర్గం వారికి వర్గపోరు నడుస్తోంది. గతంలో ఊరు వదిలి వెళ్లిపోయిన వైరి వర్గంవారు తిరిగి వచ్చారు. ఎప్పట్నుంచో వారి కోసం ఎదురు చూస్తోన్న ప్రత్యర్థులు పొలంలో పరమేశ్‌ను హత్య చేశారు. వెంకటేశ్‌ను గ్రామంలో చంపేశారు. గోవింద్ పొలం నుంచి వస్తుండగా వేటకొడవళ్లతో దాడి చేయగా.. తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలానికి డీఎస్పీ భార్గవి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి దారుణహత్య

**తనకల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున తనకల్లు పీఎస్ ఎదుట ఈశ్వరప్ప అనే వ్యక్తిని అన్నదమ్ములు హరి, చెన్నప్ప హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగినేపల్లికి చెందిన ఈశ్వరప్ప.. ఈనెల 1న హరి భార్యను తీసుకెళ్లాడు. హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గాలింపు చేపట్టారు. వారిరువురూ గూడూరులో ఉన్నట్లు తెలుసుకుని ఆదివారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున పీఎస్ వద్దకు వారిద్దరినీ తీసుకొచ్చారు. కారు దిగి స్టేషన్‌లోకి వెళ్తుండగా.. ఈశ్వరప్పను హరి, చెన్నప్ప కొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటనతో హరి భార్య అక్కడి నుంచి పరారైంది.

# క్రైం వాయిస్

## బెట్టింగులకు బలైన యువకుడు



**అన్నమయ్య జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా పెద్దమండెం మండలంలో ఓ యువకుడు బెట్టింగులకు పాల్పడి తన ప్రాణాన్ని బలితీసుకున్నాడు. మృతుడి తండ్రి శివానంద పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సిద్ధవరం గ్రామం కోటగుట్టపల్లికి చెందిన గంపల శివానంద కొడుకు రెడ్డిశేఖర్(20), ఇంటర్ చదివి ఇంటిపట్టునే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన మొబైల్ ఫోన్లో బెట్టింగ్ యాప్ తో గేమ్ ఆడి సుమారు లక్షల్లో పోగొట్టుకున్నాడు. ఆ అప్పులు తీర్చలేక ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెద్ద బండిమీద ఎస్ఐ ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం, మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## అమెరికాలో తెలుగు యువతి హత్య

### ఇండియాకు పరారైన నిందితుడు అర్జున్ శర్మ తమిళనాడులో అరెస్ట్





**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో తెలుగు యువతి నిహారిక హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిహారికను హత్య చేసిన అనంతరం భారత్‌కు పరారైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్జున్ శర్మను తమిళనాడులో ఇంటర్‌పోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో సంచలనం రేపింది. అమెరికాలో నిహారిక హత్యకు గురైన తర్వాత కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకున్న అక్కడి పోలీసులు, ఇంటర్‌పోల్ సహకారంతో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అర్జున్ శర్మ భారత్‌కు పారిపోయినట్టు గుర్తించిన అధికారులు, అతని కదలికలను ట్రాక్ చేసి తమిళనాడులో అదుపులోకి తీసుకున్నారు. ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఈ అరెస్ట్ జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, అతడిని అమెరికాకు అప్పగించే ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ కేసు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రవాస తెలుగు సమాజంలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. నిహారికకు న్యాయం జరగాలని, నిందితుడికి కఠిన శిక్ష పడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు పూర్తి వివరాలు త్వరలో వెల్లడించే అవకాశముంది.

## ఉరేసి.. గుండెపోటని నాటకమాడి.. ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

**నిజామాబాద్ నేరవిభాగం, మాక్లూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తన భర్త ఇంట్లో గుండెపోటుతో చనిపోయాడని అందరికీ చెప్పింది. బోరున ఏడుస్తూ హడావుడిగా అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. కానీ, ఇజ్రాయెల్‌లో ఉన్న మృతుడి తమ్ముడికి అనుమానం రావడంతో ఆమె బండారం మొత్తం బయటపడింది. ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హతమార్చి అందరి ముందు నాటకమాడినట్లు పోలీసులు తేల్చడంతో గ్రామస్థులు విస్తుపోయారు. ఆదివారం నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బోర్గాం(కే) గ్రామానికి చెందిన పల్లాటి రమేశ్(35), సౌమ్య(అరుణలత) దంపతులకు 13 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత నెల 20న రమేశ్ ఇంట్లో గుండెపోటుతో మరణించాడని బంధువులకు చెప్పి అంత్యక్రియలు చేయించారు. రమేశ్ మెడపై గాట్లు ఉన్నట్లు కొందరు స్థానికులు ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి చెప్పారు. ఈ మేరకు మాక్లూర్ పోలీసులకు గత నెల 21న ఫోన్ చేసి తన సోదరుడి మరణంపై అనుమానాలున్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 24న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించడంతో హత్యగా తేలింది. సౌమ్యను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించారు. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్న ఆమెకు అక్కడి పీఈటీ, నందిపేట్ మండలం బాద్గుణకు చెందిన నాలేశ్వర్ దిలీప్‌తో పరిచయం ఏర్పడి.. వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం రమేశ్‌కు తెలిసి భార్యతో గొడవపడ్డారు. దీంతో ప్రియుడితో కలిసి అతన్ని అడ్డుతొలగించుకోవాలని ప్రణాళిక వేశారు. గతేడాది ఆగస్టులో రమేశ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దిలీప్ కారుతో ఢీకొట్టడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇది విఫలంకావడంతో సౌమ్య తన బంగారు ఉంగరాన్ని రూ.35 వేలకు విక్రయించి సుపారీ గ్యాంగ్‌తో చంపించేందుకు పథకం రచించింది. అందులో భాగంగా గత నెల 19న రమేశ్‌కు మంచినీటిలో 10 నిద్ర మాత్రలు కలిపి తాగించడంతో నిద్రలోకి జారుకున్నారు. అనంతరం సుపారీగ్యాంగ్‌ను పిలిపించి వారితో చంపించాలని ప్రయత్నించగా వారు ఫోన్‌లో స్పందించలేదు. ఈ విషయం తెలిసి దిలీప్ తన తమ్ముడు అభిషేక్‌తో కలిసి సౌమ్య ఇంటికి వెళ్లారు. ముగ్గురూ కలిసి రమేశ్ మెడకు టవల్ బిగించి.. దిండుతో ముక్కు, నోరు మూసి చంపారు. ఈ కేసులో నిందితులు సౌమ్య, దిలీప్, అభిషేక్‌తోపాటు సుపారీగ్యాంగ్ సభ్యులు మాధాపూర్ గ్రామానికి చెందిన జితేందర్, వేణుకిషాన్‌నగర్ తండాకు చెందిన లోత్ శ్రీరామ్ ఎలియాస్ బబ్లూ, రమావత్ రాకేశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడు.



# బిజినెస్ వాయిస్

## ఇండియాలో అత్యంత విలువైన టాప్ 10 కంపెనీలివే..




రెండో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉంది. రూ.15.34 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఇండియాలో అత్యంత విలువైన టాప్ 10 కంపెనీలివే భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దేశ ఆర్థికాభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తున్న అగ్రగామి కంపెనీలపై ఆసక్తి నెలకొంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా, భారతదేశంలో అత్యంత విలువైన టాప్-10 కంపెనీల వివరాలు, వాటి రంగాల ప్రాముఖ్యత, మార్కెట్ విలువలను పరిశీలిద్దాం. రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో నిలిచింది. మార్కెట్ క్యాప్ రూ..19.30 లక్షల కోట్లతో, ఇంధనం, టెలికాం, రిటైల్, డిజిటల్ సేవలలో ఈ సంస్థ తనదైన ముద్ర వేసింది. జియో ద్వారా టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు, రిటైల్ విభాగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పునర్వినియోగ ఇంధనంపై భారీ పెట్టుబడులు దీని ప్రత్యేకతలు. రెండో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉంది. రూ.15.34 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. రిటైల్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలలో ఉన్నత స్థాయిని ప్రదర్శిస్తూ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌తో విలీనంతో సంస్థ స్థిరత్వం మరింత పెరిగింది. భారతీ ఎయిర్‌టెల్ మూడవ స్థానంలో నిలిచింది. రూ.11.44 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, మొబైల్, బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్ సేవలలో దేశీయంగా, అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉంది. గూగుల్‌తో భాగస్వామ్యం గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్నెట్ విస్తరణకు దోహదపడుతోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూ.11.42 లక్షల కోట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. గ్లోబల్ ఐటీ సేవల కంపెనీగా 46 దేశాల్లో డిజిటల్ సేవలను అందిస్తోంది. క్లౌడ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో పెట్టుబడులు దీని బలాన్ని పెంచుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.10.29 లక్షల కోట్లతో ఐదవ స్థానంలో ఉంది. డిజిటల్ బ్యాంకింగ్, వినియోగదారుల అనుభవాలను ఆధారంగా చేసుకుని వేగంగా అభివృద్ధి చెందుతోంది. విస్తృత బ్రాంచ్ నెట్‌వర్క్ దీని విజయానికి ఆధారం. రాబోయే రోజులు కఠినం ఆరో స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిలిచింది. రూ.7.24 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, ఇది దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా, 22,000కుపైగా బ్రాంచ్‌లతో దేశవ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వ రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇన్ఫోసిస్ ఏడవ స్థానంలో ఉంది. రూ.6.81 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో, 50 దేశాల్లో సేవలు అందిస్తూ గ్లోబల్ ఐటీ రంగంలో ముఖ్య స్థానాన్ని కలిగి ఉంది. డిజిటల్ సేవలు, ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలలో ముందంజలో ఉంది. ఎల్ఐసీ రూ.5.95 లక్షల కోట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. దేశంలో అతిపెద్ద బీమా సంస్థగా 59% మార్కెట్ వాటాను కలిగి ఉంది. బీమా సేవలతోపాటు పెట్టుబడులలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. బజాజ్ ఫైనాన్స్ తొమ్మిదవ స్థానంలో నిలిచింది. రూ.5.74 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో కన్స్యూమర్, ఎస్ఎంఈ, కమర్షియల్ ఫైనాన్సింగ్ రంగాల్లో బలమైన ఉనికిని కలిగి ఉంది. డిజిటల్ సేవలలో ఆవిష్కరణలు సంస్థ విజయానికి దోహదపడుతున్నాయి. చివరిగా, పదవ స్థానంలో హిందూస్థాన్ యునిలీవర్ ఉంది. రూ.5.49 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో డవ్, లక్స్, లిప్టన్ వంటి బ్రాండ్‌లతో ఎఫ్ఎంసీజీ మార్కెట్‌ను ఆధిపత్యంగా ఆక్రమించింది. బ్రాండ్ నైపుణ్యం, వినియోగదారుల విశ్వాసం సంస్థ బలంగా నిలిచాయి. ఈ టాప్-10 సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేస్తున్నాయి. డిజిటలైజేషన్, టెక్నాలజీ, వినియోగదారుల నమ్మకం, పెట్టుబడుల వ్యూహాలతో ఇవి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. మార్కెట్ విలువల ఆధారంగా సంస్థల సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు, కానీ దీర్ఘకాలికంగా వీటి పనితీరు దేశ ఆర్థిక స్థిరత్వానికి ప్రతిరూపంగా మారుతోంది.

### రిలయన్స్ మూడు నెలల

## నికర లాభం రూ.26,994 కోట్లు




దేశీయ దిగ్గజ సంస్థల్లో అత్యంత కీలకమైన.. విలువైన కంపెనీలలో రిలయన్స్ ముందు ఉంటుంది. ఈ ఏడాది మొదటి త్రైమాసికం ఫలితాల్లో రిలయన్స్ దుమ్ము రేపింది. రిలయన్స్ 3 నెలల నికర లాభం రూ.26,994 కోట్లు దేశీయ దిగ్గజ సంస్థల్లో అత్యంత కీలకమైన.. విలువైన కంపెనీలలో రిలయన్స్ ముందు ఉంటుంది. ఈ ఏడాది మొదటి త్రైమాసికం ఫలితాల్లో రిలయన్స్ దుమ్ము రేపింది. సదరు సంస్థ చరిత్రలోనే తొలిసారి ఆకర్షణీయమైన లాభాల్ని ప్రకటించింది. ఒక క్వార్టర్ లో అత్యధికంగా రూ.26,994 కోట్ల రికార్డు స్థాయి నికర లాభాన్ని ఆర్జించినట్లుగా పేర్కొంది. గత ఏడాది ఇదే కాలానికి రూ.15,138 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది లాభాల శాతాన్ని ఈ ఏడాది శాతంతో లెక్కిస్తే ఇది కాస్తా 78 శాతం వృద్ధి రేటును నమోదు చేసినట్లు అవుతుంది. డిజిటల్ బిజినెస్ ల విభాగం.. జియో ప్లాట్ ఫామ్స్ క్యూ1 నికర లాభం 25 శాతం వృద్ధితో రూ.7110 కోట్లు కాగా.. స్థూల ఆదాయం 19శాతం పెరిగి రూ.41,054కోట్లకు చేరినట్లుగా పేర్కొంది. మొబిలిటీ.. హోమ్స్ విభాగంలో చందాదారులు పెరగటం.. డిజిటల్ సర్వీసుల వ్యాపారం బలపడటంతో పెద్ద ఎత్తున లాభాలకు కారణమైందని చెప్పాలి. 7.4 మిలియన్ సబ్ స్క్రైబర్లతో జియో ఫైబర్ ప్రపంచంలోనే అతి పెద్ద ఫ్లిడ్ వైర్ లెస్ సంస్థగా అవతరించినట్లుగా రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటించారు. ూశ్రీంశీ =ఖుం - తెలంగాణతో నీళ్ల పంచాయితీ.. చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు జియో 5జీ వినియోగదారులు 20 కోట్లు దాటారని.. 2 కోట్ల హోమ్ కనెక్ట్ చేరుకున్నట్లుగా పేర్కొన్నారు. ఇక..రిలయన్స్ రిటైల్ విభాగంలో భాగమైన రిటైల్ వెంచర్స్ నికర లాభం క్యూ1లో 28 శాతం దూసుకెళ్లటం విశేషం. దీంతో పాటు కంపెనీకి చెందిన వివిధ విభాగాలు వృద్ధి కూడా రిలయన్స సంస్థ గరిష్ఠలాభాల్ని సాధించేందుకు సాయం చేశాయని చెప్పాలి. ఒక్క చమురు వ్యాపారంలోనే లాభాలు తగ్గాయి. ఐపీఎల్ సీజన్ దెబ్బతో జియో స్టార్ రూ.11,222 కోట్ల ఆదాయాన్ని.. రూ.1017 కోట్ల ఎబిటాను నమోదు చేసింది. ఈ భారీ లాభాలతో ఏప్రిల్ - జూన్ మూడు నెలల కాలానికి ఒక్కో షేరుకు రూ.19.95 లాభం దక్కింది. మూడు నెలల కాలంలో రిలయన్స్ చరిత్రలో ఇదే గరిష్ఠంగా చెప్పొచ్చు.

# వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

**పని లేక..పాడిన పాటే మళ్లీ మళ్లీ.. - శివయ్య ఆగ్రహానికి గురికాక తప్పదు - భక్తులు, ప్రజల మనోభావాలతో ఆటలు వద్దు**
**హిందూ ధర్మ పరిరక్షణ మన అందరిదీ - భక్తుల మనోభావాలు కాపాడిన కూటమి ప్రభుత్వం**
**వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలపై కూటమి నాయకులు మరోసారి ఆగ్రహం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షరామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గల కపాలేశ్వర స్వామి ఘట్టం వద్ద శివలింగం ఆగమశాస్త్రల ప్రకారం పునః ప్రతిష్ట చేసినా వైఎస్ఆర్సిపి నాయకులు దిగజారుడు రాజకీయాలు చేయడం నీతిమాలిన చర్య అని, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఆ శివయ్య ఆగ్రహానికి గురికాక తప్పదని కూటమి పార్టీ నాయకులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఉమ్మడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో బిజెపి అనకాపల్లి జిల్లా ఇన్చార్జి కర్రి చిట్టిబాబు, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, కంచుమర్తి బాబురావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్,టేకుమూడి సత్యనారాయణ, కాటే సుబ్రహ్మణ్యం, కొట్టువాడ హరిబాబు, కేశవ రాఘవేంద్రరావు తదితరులు మీడియాతో మాట్లాడారు. ద్రాక్షరామంలో కపాలేశ్వర స్వామి వారి శివలింగాన్ని విచ్ఛిన్నం చేయడం విచారకరమని, ఈ ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తక్షణం స్పందించి పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తశీ చేయడంతో 8 గంటల్లోపే నిందితుడుని అరెస్ట్ చేశారన్నారు. ఈ సున్నితమైన సంఘటనపై బీజేపీ నాయకులు స్పందించలేదని వైసీపీ నాయకులు పిల్లి సూర్యప్రకాష్ ఆరోపించడం సరి కాదన్నారు. హిందువుల మనోభావాలతో వైసీపీకు సంబంధం లేదా.. దేశ సమగ్రత, హిందూ పరిరక్షణ కు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడుని అరెస్టు చేసినా.. ఎందుకు ఈ రాజకీయాలు.. భక్తుల మనో భావాలతో ఈ ఆటలేంటి అంటూ ప్రశ్నించారు. పనీపాటా లేని వైసిపి నాయకులు అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో దేవాలయాలపై ఎన్నో ఆగడాలు జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ.. రామచంద్రపురం నియోజకవర్గం లోనూ సుపరిపాలన అందిస్తున్న మంత్రి సుభాష్‌ను రాజీనామా చేయాలని అడగడం సిగ్గుచేటని, మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి వాళ్ళు తమతో వస్తే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తామని అందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. వైసీపీ నాయకులకు కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై మాట్లాడే అవకాశం లేక దైవ సన్నిధిలో రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కపాలేశ్వర స్వామి శివలింగ పునః ప్రతిష్ట పండితులు ఆగమ శాస్త్రం ప్రకారం చేసినా నానా హైరానా ఎందుకు పడుతున్నారో అర్థం కావట్లేదని, ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అనుభవజ్ఞులైన పండితులు, ఆగమ శాస్త్రాలు తెలిసిన పండితులు సమక్షంలో శివలింగం పున ప్రతిష్ట జరిగిందన్నారు. సెంట్రల్ ఆర్కియాలజీ సంప్రదింపులతోనే కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించవద్దని, పవిత్రమైన ఆలయాల్లో రాజకీయాలు వద్దని అన్నారు. పరమేశ్వరుని సన్నిధిలో రాజకీయాలు వద్దని, ఆ శివయ్య క్షమించరన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఏసుదాసు, పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు అందజేత వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంతో ఉపాధికి మరింత గ్యారంటీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొత్త రూపును తీసుకువచ్చి నేటి పరిస్థితులకు అనుగుణంగా అందరికీ మేలు కలిగే విధంగా వికసిత్ భారత్ జిరామ్ జీ పథకం రూపుదిద్దుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. దీనితో ఉపాధికి మరింత గ్యారంటీ రాబోతోందని ఎమ్మెల్యే బండారు అన్నారు. కొత్తపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.125 రోజుల వేతన ఉపాధి హామీ తో పాటు నీటి భద్రత, రైతాంగానికి మేలు చేసేవిధంగా వికసిత్ భారత్ జీరామ్ జీ ఉండబోతుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఆస్తులు ఏర్పాటు చేసే విధంగా, మౌలిక సదుపాయాల కోసం, రహదారుల అనుసంధానం కోసం, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాల గదుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ కోసం ఈ పథకం ఉపయోగ పడుతుందన్నారు. గతంలో 100 రోజులు ఉన్న పని దినాల సంఖ్య నేడు 125 రోజులకు పెరగడం, వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా 60 రోజులు వ్యవసాయ పనుల సమయంలో విరామం ఉంటుందన్నారు.మిగిలిన రోజుల్లో 125 రోజులు ఉపాధిహామీ గ్యారంటీ లభించడం పేదప్రజలకు మేలు చేసేవిధంగా ఉందని తెలియజేశారు. జీవనోపాధి పెంచడం కూడా ఈ పథకంలో భాగం అన్నారు. కొత్తపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. రూ.5లక్షలతో గవర్నమెంట్ హాస్పటల్ లో షెడ్ నిర్మించామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి రూ.1.87కోట్లకు అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖా మంత్రులకు పంపడం జరిగిందన్నారు. వీఆర్వో ఆఫీసు సమీపంలో రెండు బస్ షెల్టర్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.ఆర్డబ్ల్యూఎస్ ఆఫీస్ తీసుకురావడం జరిగిందన్నారు. ఎక్సైజ్ కార్యాలయం బ్యాంక్ కాలనీకి షిఫ్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏనుగు మహల్ లో డ్రైన్లు, రహదారులు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కైలాసభూమి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.రూ.3 కోట్లతో నిర్మించనున్న కమ్మిరెడ్డి పాలెం వాడపాలెం రహదారి పనులు త్వరలోనే మొదలుపెడతామన్నారు. వాడపాలెం పెదపేట రహదారి తారు రోడ్డుగా మార్చడానికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు పాసు పుస్తకాలు అందజేశారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన అనేక రెవెన్యూ తప్పిదాలను సరిదిద్ది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు అందివ్వడం జరుగుతుందన్నారు. ఇంకా రైతులకు కొన్ని సమస్యలు మిగిలి ఉన్నాయని వాటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అనేక మార్పులు చేయడం జరిగిందని, 17 అధికారాలు డీ సెంట్రలైజ్ చేయడం జరిగిందన్నారు. పరిసరాలు బాగుండాలంటే అందరూ పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ని చెత్త రహిత రాష్ట్రంగా, కొత్తపేట చెత్త రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. మన ఇల్లు ఎంత బాగున్నా, మన వీధులు, గ్రామాలు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనం అనారోగ్యం పాలవడం గ్యారంటీ అన్నారు. అందుకే అందరూ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మల్కిపురం మండలం ఇరుసమండ గ్రామంలో**

# ఓఎన్‌జిసి గ్యాస్ లీక్

**ప్రమాదానికి గల కారణాలను ఓఎన్‌జిసి సిబ్బందిని అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మల్కిపురం మండల పరిధిలోని ఇరుషమండ గ్రామంలో ఓఎన్జిసి బోరుబావి నుండి మధ్యాహ్నం 12:20 గంటలకు డ్రిల్లింగ్ జరుగుతున్న సందర్భంలో ఆకస్మికంగా బోరుబావి నుండి గ్యాస్ వ్యాపించి ఆ ప్రాంతమంతా కమ్మి వేసిందని తదుపరి 12:40 గంటలకు మంటలు వ్యా పించినట్లు ఓఎన్జిసి సిబ్బంది తెలిపారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు ఈ బోరు బావి ఇన్సులేటెడ్ బోరు బావని 30 నుంచి 40 వేల క్యూబిక్ మీటర్ల నిక్షపాలు నిల్వలు ఉన్నట్లుగా అధికా రులు విశ్లేషించారన్నారు. ఈ బోరు బావి 1993లో ఓఎన్జిసి వారు 20 24 లో డీప్ ఇండస్ట్రీస్ వారికి అద్దెకి ఇచ్చినట్లు తెలిపారు వారు డ్రిల్లింగ్ చేస్తుండగా ఈ యొక్క సంఘటన జరిగిందని ఆయన వెల్లడించారు. ఓఎన్జిసి అధికారులు గ్యాస్ బావి వద్ద పరిస్థితిలను విశ్లేషించి చుట్టుపక్కల ఒక కిలోమీటర్ పరిధిలో ఎవరు నివాసాలు లేకుండా చూడాలని తెలిపారని ఆ విధంగా ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను ఖాళీ చేయించారని తెలిపారు. అదేవిధంగా రెండు పాఠశాలలకు సెలవులు ప్రకటించారన్నారు. ఈ బోరుబావి నుండి మంటలు సుమారు 20 మీటర్లు ఎత్తున 25 మీటర్లు వెడల్పుతో ఎగిసిపడుతు న్నట్లు తెలిపారు. 200 మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన పంట కాలువ నుండి మంటలను అదుపు చేసేందుకు నీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఓఎన్జిసి అధికారులు ఈ ప్రాంత బ్లో అవుట్ స్థితి గతులను విశ్లేషించడం జరిగిందని, వారు మంటల వ్యాప్తిని అరికడుతూ అదుపు చేసేందుకు కావలసిన ఎక్విప్మెంట్ ను సిద్ధం చేసుకుంటున్నారని ప్రభుత్వ పరంగా కూడా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరో 24 గంటల్లో ఈ బోరు బావి నుండి బ్లో అ వుట్ గ్యాస్ మంటల పరిస్థితి నియంత్రణపై స్పష్టత రానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జిల్లా పోలీస్ సూపరింటెం డెంట్ రాహుల్ మీనా ఆర్డీవో కే మాధవి స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈదరపల్లిలో స్వచ్ఛ భారత్

**పిచ్చి మొక్కలు కొట్టించిన అధికారులు**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ గ్రామం ఈదరపల్లిలో గ్రామ పంచాయతీ మంచినీళ్ల చెరువుగట్టు వద్ద సోమవారం అధికారులు పిచ్చి మొక్కలు కొట్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పోలిశెట్టి వీరబాబు, తెలుగుదేశం నాయకులు మల్లవరపు ప్రసాద్, జనసేన వీర మహిళ, పంచాయతీ కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు కొత్త పల్లినాగబాబు, పంచాయతీ గుమస్తా నాగబాబు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ అడపా సత్తిబాబు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

**ట్రూ-అప్ భారల నుండి**

# ప్రజలకు విముక్తి విద్యుత్ భారాలు

**ప్రజలపై పైసా భారం పడనీయం-రెడ్డి అనంత కుమారి**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా,గత ప్రభుత్వాల వైఫల్యాల వల్ల ఏర్పడిన విద్యుత్ భారాలను ప్రజలపై పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి తెలిపారు. రాష్ట్ర విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలను వివరించారు. గత ప్రభుత్వ పాపాల వల్ల పేరుకుపోయిన రూ. 4,498 కోట్ల విద్యుత్ ట్రూ-అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని చెప్పారు. ఇది దేశంలోనే తొలిసారిగా అమలవుతున్న చారిత్రాత్మక సంస్కరణగా ఆమె అభివర్ణించారు. 'ట్రూ-డౌన్' మెకానిజం ద్వారా విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు 13 పైసలు తగ్గించి వినియోగదారులకు ప్రత్యక్ష ఊరటనిచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. 2019-2024 మధ్య కాలంలో గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తొమ్మిది సార్లు పెంచి, సుమారు రూ. 32 వేల కోట్ల భారాన్ని సామాన్య ప్రజలపై మోపిందని విమర్శించారు. కమీషన్ల కోసం విద్యుత్ కొనుగోళ్లు చేస్తూ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు.2019 నాటికి చంద్రబాబు నాయుడు గారు ఆంధ్రప్రదేశ్‌ను విద్యుత్ మిగులు రాష్ట్రంగా అప్పగిస్తే, గత ప్రభుత్వం తీసుకున్న తప్పు నిర్ణయాల వల్ల విద్యుత్ రంగం రూ. 1.29 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లిందని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యత ఇస్తూ, సోలార్ మరియు విండ్ పవర్ ద్వారా యూనిట్ విద్యుత్‌ను రూ. 4.70కే అందించేలా చర్యలు చేపడుతోందన్నారు.ప్రజల సంక్షమమే ధ్యేయంగా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ రంగం మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని రెడ్డి అనంత కుమారి ధీమా వ్యక్తం చేశారు.

# అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** సంక్రాంతి ముందే వచ్చిందా అన్న చందంగా రావులపాలెం ఆర్య వైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో రావులపాలెంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగవల్లులు, గోదాదేవి, హరిదాసు వేషధారణలు, బొమ్మల కొలువుల హడావిడితో రావులపాలెం ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ బొమ్మలతో చిన్నారులు బొమ్మల కొలువును అందంగా తీర్చిదిద్దారు. హరిదాసు, సాంప్రదాయ వేషధారణలతో చిన్నారులు అలరించారు. రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది గొబ్బెమ్మలను పెట్టారు. గొబ్బెమ్మలు వేసి మధ్యలో కృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి దాని చుట్టూ చిన్నారులు, మహిళలు కోలాటంతో ఆడుతూ పాడుతూ పల్లెల్లో జరిగే పండుగ వాతావరణన్ని ప్రతిబింబించారు. చిన్నారులకు మహిళలు భోగి పళ్ళు పోశారు. మన సంస్కృతి సాంప్రదాయాలను చిన్నారులకు తెలియజేసేందుకు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు రావులపాలెం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాణిక్యాంబ, కార్యదర్శి తాయారు తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాణిక్యాంబ, కార్యదర్శి తాయారు, లావణ్య, మాధురి, సుష్మ, ప్రియాంక, పావని, వల్లారి, సునీత, కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలి

**అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం, ఇరుసుమండ గ్రామంలో గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. చమురు సంస్థల కార్యకలాపాల వల్ల జరుగుతున్న గ్యాస్ లీకేజీలు, అగ్ని ప్రమాదాల దృష్ట్యా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఇటువంటి ఘటనలను నివారించేందుకు యుద్ధప్రాతిపదికన కనీస అవసరమైన సదుపాయాలు అయినా ఏర్పాటు చేయాల్సిన అత్యవసర అవసరం ఉందని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో గ్యాస్ లీకేజీతో పాటు అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న ఆమె, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే చమురు సంస్థలు ప్రైవేట్ వ్యక్తులకు నిర్వహణ అప్పగించడంతో వారు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని, ప్రమాదాలు సంభవించినప్పుడు బాధ్యత వహించడం లేదని అనురాధ తెలిపారు.కోనసీమ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో చమురు సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని, వాటి కారణంగా తరచూ గ్యాస్ లీకేజీలు, అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనల వల్ల సమీప గ్రామాల్లో నివసించే ప్రజలు నిరంతరం భయాందోళనల్లో జీవిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తాను ఎంపీగా ఉన్న సమయంలో లోక్‌సభలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలనే అంశాన్ని ప్రస్తావించడమే కాకుండా, పలుమార్లు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఈ కీలక సదుపాయం ఏర్పాటు కాకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, సమగ్ర అధ్యయనం చేపట్టి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీతో పాటు ప్రస్తుతం తక్షణ అవసరమైన కనీస సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని చింతా అనురాధ గట్టిగా డిమాండ్ చేశారు.

**మెరక భూమికి మూడు సంవత్సరములకు**

# కౌలు శిస్తునకు బహిరంగ వేలం పాట



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న మందపల్లి క్షత్ర పాలకుడైన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం తాలూకు కొత్తపేట గ్రామంలోని సర్వే నెంబరు 5/1 లో గల య.1-04 సెంట్లు మెరక భూమికి మూడు సంవత్సరములకు కౌలు శిస్తునకు బహిరంగ వేలంపాట నిర్వహించగా బొక్క నాని, చెల్లిరేవు వారు సంవత్సరమునకు రూ.51,500/- చెల్లించుటకు హెచ్చుపాట పాడుకునియున్నారు. ఈ బహిరంగ వేలంపాటలకు పర్యవేక్షన అధికారిగా గోపాలపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి బి. కిరణ్ పర్యవేక్షంచియున్నారు. ఈ వేలంపాటలో మందపల్లి దేవస్థానం ధర్మకర్తల మండల సభ్యులు గవర వీర వెంకట సత్యనారాయణ,దేవపాటి వెంకటేశ్వరరావు మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొనియున్నారని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

**ఆత్రేయపురం ఉత్సవాలకు ప్రజలంతా**

# పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి : బండారు సంజీవ్



**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని లొల్ల లాకుల వద్ద కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్ ఈ సందర్భంగా జనవరి 11, 12, 13 తేదీల్లో జరగనున్న ఆత్రేయపురం ఉత్సవం పోస్టర్‌ను మీడియాకు విడుదల చేసి, ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.లొల్ల లాకులు సుమారు 2.20 లక్షల ఎకరాల సాగుభూమి కి సాగునీరుఅందించే వనరుగా ఉన్నాయని తెలిపారు. ఈ లొల్ల లాకుల ఆధునీకరణకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి వసతులను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.అలాగే, లొల్ల లాకుల పరిసర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. ప్రకృతి సౌందర్యంతో నిండిన ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని బండారు సంజీవ్ పేర్కొన్నారు.ఆత్రేయపురం ఉత్సవం ద్వారా కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం ఉందని, ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

# డ్రాగన్ పడవల పోటీలు విజయవంతం చేయాలి



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సంక్రాంతి పండుగల పురస్కరించుకుని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో జనవరి 11, నుంచి 13వ తేదీ వరకు డ్రాగన్ పడవల పోటీలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్, నిర్వాహకులు ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు (తాడిపూడి బాబు) తెలిపారు సోమవారం మండలంలోని లొల్ల లాకులు వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఈ పోటీలను జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు ఈ పోటీలతోపాటు ఈత పోటీలు, రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్, ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను సినీ సంగీత విభావరిలో ఏర్పాటు చేశామని ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆస్వాదించాలని కోరారు.



# గుండె పోటుతో వరుపుల తమ్మయ్యబాబు మృతి



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ మాజీ ఇంచార్జి వరుపుల తమ్మయ్యబాబు (51) సోమవారం గుండె పోటుతో మరణించారు. ఏలేశ్వరం మండలంలోని స్వగ్రామం లింగంపర్తి స్వగృహంలో అస్వస్థతకు గురవ్వగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తరలించుకుని వెళ్తుండగా మార్గం మధ్యలో ఆయన మరణించారు. తమ్మయ్యబాబు పార్థివ దేహాన్ని స్వగ్రామం లింగంపర్తికి కుటుంబ సభ్యులు తరలించుకు వచ్చారు. తమ్మయ్యబాబుకు భార్య వెంకటలక్ష్మ, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. బి.ఎ. గ్రాడ్యుయేట్ అయిన తమ్మయ్యబాబు 1983 సంవత్సరంలో జరిగిన సమితి ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004-2009 మధ్య కాలంలో ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్తు అధ్యక్షునిగా మండల ప్రజానీకానికి పలు సేవలను అందించారు. అనంతర కాలంలో ఆ పదవిని వెంకటలక్ష్మ కూడా చేపట్టారు.అబశ్రీశ్రీ ఇప్పుడు ఆమె రాజకీయాలకు దూరంగా గృహస్థ ధర్మంలో ఉన్నారు. తనపై క్రిమినల్ కేసులు లేవని, తన ఆస్తులు రూ. 1,09,50,000 లని, అప్పులు రూ. 18,00,000 లని అఫిడవిట్లో పేర్కొంటూ 2019 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మయ్యబాబు పోటీ చేసి పరాజయం పొందారు. అప్పటి నుంచి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జిగా కొనసాగుతూ పార్టీ రాజకీయ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉండేవారు. కాకినాడ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి తన కుమారుడు సాయికిరణ్ ను వరించాలని తమ్మయ్యబాబు ఆకాంక్షించే వారు.అబశ్రీశ్రీ ఈ కాల క్రమంలో 9 మార్చి 2025 న రాత్రి 9.30 గంటల సమయంలో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో విధులను నిర్వహిస్తున్న మహిళా వైద్యురాలు శ్వేత, ఆస్పత్రి సిబ్బందిని ఉద్దేశించి ప్రభుత్వానికి ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ములతోనే కదా మీరు జీతాలు తీసుకుంటున్నారు. వళ్ళు దగ్గర పెట్టుకొని ఉద్యోగం చేయండని వాచ్చరిస్తూ తమ్మయ్యబాబు ఆగ్రహంతో దురుసుగా ప్రవర్తించినట్లు సామాజిక మాధ్యమాల్లోనూ, ఆపై ప్రధాన వార్తా మాధ్యమాల్లోనూ పలు వార్తా కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన్ని 12 వ తేదీన పార్టీ నుంచి సస్పెండ్ చేసారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టానం అధికారులకు కూడా సూచించింది. తనను మన్నించి పార్టీ తనకు పునఃస్వాగతం పలుకుతుందని తమ్మయ్యబాబు ఆశిస్తున్న తరుణంలో అకాల మరణం గుండె పోటు రూపంలో ఆయన్ని వెంటాడింది. మన మధ్య తమ్మయ్యబాబు భౌతికంగా లేకపోడం నియోజకవర్గ ప్రజానీకానికి తీరని లోటని విజయవాడ రైల్వే డివిజన్ సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, కాకినాడ జిల్లా టెలీకమ్యూనికేషన్స్ సలహా మండలి సభ్యుడు మేకల కృష్ణ, జనసేన రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, జిల్లా పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, కార్యనిర్వహణ కమిటీ సభ్యులు, తుని జోన్ ఆత్మ కమిటీ ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం, మండల పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) పేర్కొన్నారు.

### ఆదాయ విభజన లేకుండానే

# పంచాయతీ ఏర్పాటు తగదు

**కలెక్టర్ గ్రీవెన్సులో ఫిర్యాదు చేసిన కొత్తూరు ప్రజలు**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రెవిన్యూ ఆదాయ విభజన లేకుండా పంచాయతీని విడదీసి కొత్త పంచాయతీని ఏర్పాటు చేయడం తగదంటూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు పంచాయతీ శివారు కొత్తూరు ప్రజలు జిల్లా కలెక్టర్ గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు.అబశ్రీశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా పంచాయతీల విభజన, నూతన పంచాయతీల ఏర్పాటుకు తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు పంచాయతీలో అంతర్భాగంగా ఉన్న శివారు గ్రామం కొత్తూరును కూడా విడదీసి నూతన పంచాయతీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగు తున్నాయి. ఈ విషయమై లోగడ ఏర్పాటు చేసిన గ్రామ సభలో కొత్తూరు పంచాయతీ ఏర్పాటుకు రెండు గ్రామాల ప్రజలూ మాట మాత్రంంగా అంగీకరించారు. కానీ రెవిన్యూ (ఆదాయం) విభజనపై స్పష్టమైన వివరణ లేకపోవడంతో గ్రామ సభ తీర్మానం చేయలేదు. ఐతే తాజాగా గ్రామ సభ తీర్మానం చేసినట్టు దస్త్రాలను తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంచాయతీ సమర్పిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఇంఛార్జి కలెక్టరైన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కు కొత్తూరు వాసి, నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు, విజయవాడ రైల్వే డివిజన్ సంప్రదింపుల కమిటీ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు నేతృత్వంలో కొత్తూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.అబశ్రీశ్రీ గ్రామ సభను నిర్వహించలేదని, కొత్తూరు పంచాయతీకి ఏవిధమైన రెవిన్యూ భూములు లేకుండా పంచాయతీగా విడదీయడం వలన కొత్తూరు పంచాయతీకి ఏవిధమైన ఆదాయం లేకపోతే పంచాయతీ పరిపాలన సక్రమంగా ఉండదు. అందువల్ల పంచాయతీ తోపాటు రెవిన్యూను కూడా విడదీయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టరును కలసి ఫిర్యాదు చేసిన వారిలో రాయపాటి చంటి, గుండు గోవిందు, ఆకేటి శ్రీను, రాయి రామకృష్ణ, తోకల ఏసు బాబు, దేవి వెంకణ, పర్సిన శివ, తురాయి పాపారావు, కర్రి అగ్గిబాబు, సాయి, కొప్పుల వీరబాబు, గొల్లవిల్లి నూకరాజు, తేటకాయల అప్పారావు, కర్రి రామస్వామి తదితరులు ఉన్నారు.

# దుప్పట్లు పంచిన జనసేన సంయుక్త కార్యదర్శి కోన సతీష్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వేళంగి కల్వరి ప్రార్థనా మందిర 100 మంది సంఘ సభ్యులకు నూతన సంవత్సర మొదటి ఆదివారం సందర్భంగా గొంది కొత్తపల్లికి చెందిన మండలం జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి కోన సతీష్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గతంలో పెద్ద మల్లాపురం, శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు ఒక రోజు మధ్యాహ్నం పూట భోజనాలు అందించానని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శంగా తీసుకుని రాబోయే రోజుల్లో మండలంలో మరిన్ని సమాజ సేవా కార్యక్రమాలనూ చేపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో శంఖవరం స్టార్ లైట్ ఫౌండేషన్ సభ్యులు గునపర్తి అపురూప్, బత్తిన తాతాజీఅబశ్రీశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘ కాపరి యు.మోషెరాజు మాట్లాడుతూ... కల్వరి ప్రార్థన మందిరం సంఘ సభ్యులకు దుప్పట్లు అందించిన కోన సతీష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. సతీష్ ఉన్నతమైన పదవులను చేపట్టాలని ఆకాంక్షస్తూ ప్రార్థనలు చేసారు.

# రూరల్ పాత్రికేయులకు సంక్రాంతి కానుకల పంపిణీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ :** ప్రజల గొంతుకగా నిలుస్తూ నిరంతరం ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే గ్రామీణ పాత్రికేయుల సేవలు అభినందనీయమని ఎస్.బి.సి-కె.టి.సి సంస్థల డైరెక్టర్ ఎస్. కిరణ్ కుమార్ మరియు స్టీఫెన్ ఆనంద్ ఫౌండేషన్ అధినేత డా. స్టీఫెన్ ఆనంద్ పేర్కొన్నారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఎస్.బి.సి-కె.టి.సి సంస్థల డైరెక్టర్ ఎస్. కిరణ్ కుమార్,స్టీఫెన్ ఆనంద్ ఫౌండేషన్ అధినేత డా. స్టీఫెన్ఆనంద్ ల సౌజన్యంతో రూరల్ పాత్రికేయులకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజ మార్పులో జర్నలిస్టుల పాత్ర కీలకమని, పండుగ వేళ వారి ముఖాల్లో చిరునవ్వులు నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.వృత్తిపరమైన బాధ్యతలతో బిజీగా ఉండే పాత్రికేయులను గౌరవించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు కిరణ్ కుమార్, స్టీఫెన్ ఆనంద్‌లు తెలిపారు. భవిష్యత్తులో కూడా పాత్రికేయుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. కాకినాడ రూరల్ మండల స్థాయిలోని పలువురు రూరల్ జర్నలిస్టులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, వృత్తి నైపుణ్యానికి ఉపయోగపడే ఇయర్ ఫోన్స్,స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలోస్థానిక ప్రముఖులు,ఫౌండేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు. తమను గుర్తించి గౌరవించినందుకు పాత్రికేయ మిత్రులు కిరణ్ కుమార్ మరియు డా. స్టీఫెన్ ఆనంద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నగరంలో ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించండి : పితాని రాము



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర పరిధిలో ఫుట్ పాత్ మీద పాదచారులు నడవలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వాటిపై ఆక్రమణలు తొలగించాలని జనసేన మాజీ ఎంపీటీసీ పితాని వెంకట రాము సోమవారం మున్సిపల్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. మెయిన్ రోడ్డు, టూ టౌన్ పోలీస్ స్టేషన్ మొదలు జగన్నాధపురం పాత వంతెన వరకు రహదారి ఇరువైపులా ఫుట్ పాత్ లను దుకాణ యజమానులు ఇష్టారాజ్యంగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల నడిచే పాదచారులు మెయిన్ రోడ్ లో నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకవేళ ట్రాఫిక్ రద్దీగా ఉన్న రహదారిపై నడిస్తే వేగంగా వచ్చే వాహనాలు కారణంగా ప్రమాదానికి గురై ఆస్కారం ఉందని ప్రజలు భయపడుతున్నారన్నారు. రోడ్లపై , డివైడర్ల మధ్యలో అనధికారిక , ఫ్రీ లెఫ్ట్ టర్నింగ్, ఫ్రీ రైట్ టర్నింగ్ లలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు వలన వాహనదారులకు కానీ ప్రజలకు గాని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, కమిషనర్ కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# జిల్లా ఎస్పీ పిజిఆర్ఎస్‌కు 15 ఫిర్యాదులు

**సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు**



**కాకినాడక్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ. జి.బిందు మాధవ్, మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు 4, కుటుంబ కలహాలు 3 ఇతర విభాగాలకు చెందినవి 8గా గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.బిందు మాధవ్, సంబంధిత అధికారులకు"ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని, చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఆదేశాలు ఇచ్చారు,ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని. ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి శ్రద్ధతో పని చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో సంబందింత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఉదయం కేఫ్ హోటల్‌ను ప్రారంభించిన

# సినీహీరో నందమూరి కళ్యాణ్ రామ్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నలుగురు యువ మిత్రులు వ్యాపారంగంలో రాణించాలని ఆశయంతో ది ఉదయం కేఫ్ అనే హోటల్ ప్రారంభించారని దానిని అందరూ సహకరించి ప్రోత్సహించాలని సినీ నటుడు హీరో నందమూరి కళ్యాణ్ రామ్ ఆకాంక్షంచారు. వీరు కొద్ది రోజుల క్రితం భీమవరంలో ఉదయం కేఫ్ ప్రారంభించి తర్వాత కాకినాడలో సోమవారం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం సర్పవరం సెంటర్లో ది ఉదయం కేఫ్ హెూటల్ను ఆయన ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడారు.కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ వంశీ, పవన్, వంశీ, హర్ష అనే నలుగురు మిత్రులు ఈ నూతన వ్యాపార రంగంలోకి అడుగిడారని అందువలన వీరిని ప్రోత్సహించాలని కళ్యాణ్ రామ్ సూచించారు. సరసమైన ధరల్లో నాణ్యతతో కూడిన ఆహారం ఈ ఉదయంలో లభిస్తుందని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపీ చుంద్రు శ్రీహరి రావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, చుంద్రు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీలను ప్రగతి పథంలో

# నడిపిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ లలో జరిగే గ్రామ సభ నిర్వహణ లో భాగంగా నేడు కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే చీడిగ గ్రామసభలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చీడిగ గ్రామానికి సుమారు 21 కోట్ల నిధులతో(రోడ్లు, డ్రైన్లు, మంచినీటి పైపులైన్లు, గోకులలు, గృహాల నిర్మాణం, హెల్త్ క్లినిక్ నిర్మాణం, విద్యుత్ ట్రాన్సఫార్మర్లు, కరంటు స్తంబాలు తదితర ఏర్పాటు ) అందించిన సంక్షమ పథకాలు,చేసిన అభివృద్ధి పనులను వివరించి, తరువాత చేయబోయే పనులవివరాలను సభలోని ప్రజలకి తెలిపారు.. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించి వెంటనే అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కారం అవుతాయని తెలిపారు.. జిల్లా డ్వామా అధికారిణి శ్రీమతి అడపా వెంకటలక్ష్మ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, అధికారుల సమక్షంలో వికసిత్ భారత్ -జి రాంజీ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వెనిజులాపై అమెరికా చర్యలపై భారత్ తీవ్ర ఆందోళన

**భా.జ.పా. జిల్లా పూర్వ అధ్యక్షులు చిలుకూరి**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్వ స్వతంత్ర దేశం వెనిజులా మాదకద్రవ్యాలను రవాణా చేస్తోందని ఆరోపిస్తూ ఆ దేశంపై సైనిక దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని అమెరికా తన దేశానికి తరలించుకుని పోవడం ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ పేర్కొన్నారు. మాదక దవ్యాల అక్రమ రవాణా అంటూ ఆరోపిస్తూ దాన్నే ప్రపంచ దేశాలకు సాకుగా చూపించి భారీగా చమురు నిల్వలు ఉన్న వెనిజులాను అమెరికా చేజిక్కించు కుంటున్నట్లు కనిపిస్తోందని రామ్ కుమార్ విశ్లేషించారు. ఈ దుస్సంఘటన మీద భారత ప్రభుత్వం ఇప్పటికే ఆందోళన ప్రకటించిందని, అమెరికా పాల్పడిన ఈ దుందుడుకు చర్యతో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఆందోళనలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియా ప్రకటనను విడుదల చేశారు. 1939లో నాజీ సేనలు పోలాండ్ మీద దాడి జరిపి ఆక్రమించి నప్పుడు రెండో ప్రపంచ యుద్ధం సంభవించిందని, నేడు వెనిజులా మీద దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని అమెరికా తన దేశానికి తరలించుకుని పోవడం ఏ పరిస్థితులకు దారితీస్తుందోననే ఆందోళన ప్రపంచ దేశాల్లో ఉందని ఆయన అన్నారు. నిరంతరం ఏదో దేశం మీద ఆర్థిక ఆంక్షలు విధిస్తూ అమెరికా నేడు అనేక దేశాలను బెదిరించడం తోపాటు కయ్యానికి కాలు దువ్వుతోందని సర్వ స్వతంత్ర సార్వభౌమాధికారం ఉన్న దేశాల మీద అమెరికా తీసుకుంటున్న మిలట్రీ చర్యలు పట్ల యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ వంటి సంస్థలు మౌనం వహించటం మరింత ఆందోళన కలిగిస్తుందని ఆయన అన్నారు.అబశ్రీశ్రీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల మధ్య ఘర్షణ వాతావరణం ఉందని ఇజ్రాయిల్- ఇరాన్ సిరియాల మధ్య, రష్యా-ఉక్రయిన్ ల మధ్య, చైనా- తైవాన్ ల మధ్య, భారత్ -పాకిస్తాన్ ల మధ్య ఉన్న ఉద్రిక్త వాతావరణానికి తోడు నేడు అమెరికా వెనిజులాపై చేసిన దాడి ఏ పరిస్థితులకు దారితీస్తుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోందని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ పేర్కొన్నారు.

### పిజిఆర్ఎస్ దరఖాస్తులను గడువులోగా

# సమస్యలు పరిష్కరించాలి : ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమంలో ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, సీపీవో పీ త్రినాథ్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎన్ శ్రీధర్, డీఎంహెచ్ఓ జె నరసింహనాయక్, ఐసీడీఎస్ పీడీ హెచ్ లక్ష్మ, డీఆర్డీఏ పీడీ జి శ్రీనివాస రావు తదితర అధికారుల కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఇన్చార్జి కలెక్టర్.. అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డు లలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 441 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదు అయిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీలకు నాణ్యమైన పరిష్కరం అందించాలన్నారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవాడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరు కాలేని అర్జిదారులు, తమ యొక్క అర్జీలను **Meekosam.ap.gov.in** వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

**రెండో అంతస్తులో ఏర్పాటు పట్ల అర్జీదారులు ఆవేదన...**

రెవిన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ డీఆర్వో వెంకటరావు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్ సమస్యలు నిమిత్తం పరిష్కార వేదిక రెండో అంతస్తులో ఏర్పాటు చేయడంతో వృద్ధులు అసహనం వ్యక్తం చేశారు. ఎక్కువ సమయం క్యూలో నిలబడి వలసి వస్తుందని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో వివిధ రెవెన్యూ అంశాలపై 134 అర్జీలు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట్రావు తెలిపారు. అనంతరం పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో అందిన అర్జీల పరిష్కార పురోగతిని డీఆర్వో వెంకటరావు అధికారులతో సమీక్షంచారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన సమాజం పాలకమండలి ప్రమాణ స్వీకారం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో సోమవారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ సమక్షంలో చైర్మన్‌గా చింతా వీర్రాజు, పాలకమండలి సభ్యులుగా చోడిపల్లి శాంతకుమారి, ఎల్లారావు, లోవకుమారి, కొల్లు కుమారి, ఎం.నూకేష్, అందనాపల్లి శ్రీనివాస్, ఎంకే శాస్త్రి, సిహెచ్ నీరజాక్ష, పి.మణిబాలలు ప్రమాణ స్వీకారం చేశారు.

# టిడిపి సంస్కృతి, సాంప్రదాయాలకు విలువనిస్తుంది

## మూడవ రోజు ఉత్సాహంగా జరిగిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సంస్కృతి... సాంప్రదాయాలకు విలువ ఇస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు మూడవ రోజు ఉత్సాహంగా జరిగాయి. 21, 22, 23, 24, 25, 31 డివిజన్లలో జరిగిన ఈ ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో మహిళలు వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా డివిజన్లలోని ముగ్గులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం మహిళలను ఉత్సాహ పరిచేందుకే ప్రతి ఏటా తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. "టీడీపీ పార్టీ ఓట్ల కోసం పండుగలు చేయదన్నారు. సంప్రదాయాలను గుర్తు చేస్తూ ప్రజలకు చేరువగా ఉంటుందన్నారు. ప్రజల ఆనందం కోసం, సమాజంలో సాంస్కృతిక విలువలను పెంపొందించడమే లక్ష్యం" అని అన్నారు. నగర అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయని, బ్లేడ్, గంజాయిపై కఠిన చర్యలు తీసుకొని నియంత్రించినట్లు తెలిపారు. ప్రజల భద్రత తమ బాధ్యతగా తీసుకున్నామని, అవసరమైతే రౌడీ షీట్‌లు కూడా ఓపెన్ చేస్తున్నామని చెప్పారు. మహిళల రక్షణార్థం ప్రారంభించిన మీ భద్రత మా బాధ్యత, 'మహిళ రక్షణ కార్యక్రమం రాష్ట్రంలో ప్రత్యేకమైనదని, ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి రక్షణ కల్పిస్తారని వివరించారు. నగరంలోని ప్రతి డివిజన్లో విద్యుత్ సమస్యలతో పాటు స్థానికంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. పార్కులను అందంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ప్రేమ, సహకారం తమకు ప్రేరణనిస్తోందని ఆయన అభినందించారు. కాగా ఆయా డివిజన్లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కోడి పందాలు, గొబ్బెమ్మలు, హరి దాసులు, భోగి మంటలతో సంక్రాంతి శోభను ముందే తీసుకువచ్చారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా బదిరెడ్డి 75వ జన్మదిన వేడుకలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవ కమిటీ నాయకులు, బస్ స్టాండ్ వర్తకసంఘ నాయకులు స్వర్గీయ బదిరెడ్డి నాగేశ్వరరావు 75 వ జన్మదిన వేడుకలను బస్టాండ్ వర్తక సంఘ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వర్గీయ బదిరెడ్డి నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని షష్టి కమిటీ, బస్టాండ్ వర్తకసంఘ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర రామతులసి దంపతుల ఆధ్వర్యంలో పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో షష్టి కమిటీ నాయకులు కటకం సత్యనారాయణ, ఒంటిపల్లి సత్తికొండ, వుల్లి కాశి, వీరేశ్, లక్ష్మ రామకృష్ణ, శ్రీను, మైరెడ్డి రాంబాబు, వాతాడ గోపి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించండి...

## భోగాపురం విమానాశ్రయం సాధించిన ఘనత కేవలం జగన్ కి చెందింది - రాజమండ్రి సిటీ పర్యావరణాన్ని కాపాడండి... ఓటు చోరీ, క్రెడిట్ చోరీ మానండి... - పాత్రికేయుల సమావేశం లో మార్గాని భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం స్థానిక వి.ఎల్ పురం మార్గాన్ని ఎస్టేట్ నగర వైసీపీ కార్యాలయం నందు జాతీయ అధికార ప్రతినిధి నగర అధ్యక్షుడు మార్గాని భరత్ రామ్, మాజీ టిటిడి బోర్డు చైర్మన్, మాజీ శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాష్ రావు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ హిందువులకు అనుకూలంగానే దేవాలయాలు ఎంతో పవిత్రమైనవి, కొన్ని వేల సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ దేవాలయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. వీటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం పైన ఉంటుంది. కలియుగ క్షేత్రమైన తిరుపతిలో గోవిందరాజుల స్వామివారి గుడి గోపురం పైన ఎక్కి ఒక ఉన్మాది చేసిన రాద్ధాంతం, మనం ఎంతో గౌరవంతో భక్తితో దేవాలయంలోకి చెప్పులు లేకుండా ప్రవేశిస్తాము అలాంటిది ఈ ఉన్మాది తన పాదాల కింద పవిత్ర దేవాలయాన్ని తొక్కుతూ చేసిన ఘాతుకం క్షమించరాని నేరం.. అలాగే దక్షణ కాశీగా పిలవబడే దాక్షరామ ఆలయంలో శివలింగం ధ్వంసం చేసిన వ్యక్తి సాక్షత్తు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుని సొంత తమ్ముడు. ఇలా చెప్పుకుంటూ పోతే, కృష్ణ పుష్కరాలలో 44 దేవాలయాల ధ్వంసం, గోదావరి పుష్కరాలలో 28 మంది తొక్కిసలాటలో దుర్మరణం, రాజమండ్రి సిటీ లో సుబ్రమణ్యం స్వామి వారి విగ్రహం చేతులు విరగగొట్టడం ఇలా కోకొల్లలు.. కూటమి ప్రభుత్వం ఏమి చేస్తుంది ఇన్ని అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే, ఉప ముఖ్యమంత్రి, సనాతిని అనుకునే పవన్ కళ్యాణ్ నోరు మెదపరు, కూటమి భాగస్వామ్యులు అయిన బీజేపీ ప్రభుత్వం, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ నోరు మెదపరు, ఇంక ఎవరు కాపాడతారు హిందూ ధర్మాన్ని!! వాతావరణ కాలుష్యం మనం ప్రతిరోజు ఢిల్లీలో వాతావరణ కాలుష్యం ఎక్కువ అక్కడ చాలా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి అని మాట్లాడుకుంటూ ఉంటాం మన రాజమండ్రి నగరానికి వచ్చేసరికి ఎంతమందికి తెలుసు ప్రస్తుతం మన రాజమండ్రిలో వాతావరణ కాలుష్యం ఎంత తీవ్రంగా ఉన్నదో మీకు తెలియడం లేదు. అత్యంత ప్రమాదకరంగా మారే పరిస్థితిలో మన నగరం ఉంది, 2021 లో దేశ కాలుష్యం లేని నగరాలలో మన రాజమండ్రి సిటీ 6 వ స్థానంలో ఉంది. కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే తమ పబ్లిసిటీ పిచ్చితో లోకేష్ పర్యటన సమయంలో నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటుకు డివైడర్ లోని మొక్కలను పెకిలించడం, వూసలతో గుచ్చడం ఎంత ఆటవిక సంస్కృతి!! తను ఎంపీ గా ఉన్న సమయం లో నేషనల్ హై వే మీద రాజానగరం నుండి కడియం వరకు సుమారు 3500 మొక్కలను నాటించడం జరిగింది అని, స్థానిక ఎమ్మెల్యే నగరంలో గోతులు పూడ్చడం, 2300 గోతులు పూడ్చాను, గోతులు లేని నగరంగా తీర్చి దిద్దుతాను అనడం హాస్యాస్పదం.. గుంతలలో వేసే గ్రావెల్ మీద వాహనాలువెల్లడం వలన రేగిన దుమ్ము కాలుష్యానికి మరొక కారణం. అలాగే సిటీలోని పేపర్ మిల్లు యాజమాన్యంతో చర్చించి కాలుష్య నియంత్రణకు వారు తీసుకుంటున్న చర్యలను కూడా పరిశీలిస్తామని భరత్ తెలిపారు. భోగాపురం విమానాశ్రయం అసలు ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన 2023వ సంవత్సరములో చేసినది అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఇదంతా చేసింది చంద్రబాబునాయుడు గారే అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అనడం హాస్యాస్పదం అప్పటి కేంద్ర మంత్రి నితిన్ ఘట్కరి స్వయాన చెప్పడం జరిగింది ఈ విమానాశ్రయం శంకుస్థాపన ఘనత వైయస్ జగన్ గారిదే అలాగే ఈ ఎయిర్ పోర్ట్ కి సీ పోర్ట్ కి అనుసంధానంగా 55 కిలోమీటర్ల పొడవున్న సిక్స్ లేని రోడ్డుకి సుమారు 6300 కోట్ల రూపాయలు శాంక్షన్ చేయమని అడగడం జరిగింది దీనికి ముఖ్య కారకులు కేవలం వైయస్ జగన్ మాత్రమే అలాగే జిఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జున గారు వారి మాటల్లో స్వయంగా తెలపడం జరిగింది రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ హైదరాబాద్ శంకుస్థాపన ప్రారంభోత్సవం చేసింది స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు అలాగే భోగాపురం ఎయిర్పోర్ట్ శంకుస్థాపన చేసింది వైయస్ జగన్ అలాగే దేవుడి దయవల్ల పూర్తి చేసి మరల వైఎస్ జగన్ ప్రారంభోత్సవం చేయాలని ఆయన తెలపడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఓట్ చోరీ క్రెడిట్ చోరీ దీని మీదే గడుపుతున్నారు అని విమర్శించారు.

# సత్కారం జీవితంలో మర్చిపోను..

## అందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ కృతజ్ఞతలు....



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** జెఏసి ఆధ్వర్యంలో తనను ఘనంగా సత్కరించిన పౌర సన్మానంను తన జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేనని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. తన జీవితంలో మర్చిపోలేని సన్మాన కార్యక్రమం నిర్వహించిన జేఏసీ సభ్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. మండపేట లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలు తనపై చూపించిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. జేఏసీ చైర్మన్ కామన ప్రభాకరరావుకు, ఇతర జేఏసీ సభ్యులకు, తన సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరికీ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, అతిరధ మహారధులు ప్రతీ ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# మానవీయ వృద్ధుల ఆశ్రమంలో భోజన సమర్పణ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం ఉదయం సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పాత నామవరంలోని మానవీయ ఐక్య సేవా సంస్థ వృద్ధులు, అనాధలు, మానసిక వికలాంగులకు సేవా కార్యక్రమాల్లో భాగంగా 50 మందికి భోజన సమర్పణ నిర్వహించారు. ధవలేశ్వరానికి చెందిన సత్యచారిటబుల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మరియు రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ మొకరాల శ్రీనివాస్ ఈ ప్రోగ్రాం కి స్పాన్సర్ చేయడం జరిగింది. ఆశ్రమంలోని సభ్యులందరూ తృప్తిగా భోజనం చేసి వారి పెద్ద మనసుతో దాతలను మరియు సత్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తమ్మా రవి,అసిస్టెంట్ సెక్రటరీ ఎం.వి.ఆర్.ఎస్ శాస్త్రి,ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ మొకరాల శ్రీనివాస్,కోమటి వెంకట్రావు,కాళ్ళ కనకదుర్గ మరియు ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ మొదలగు వారందరూ పాల్గొన్నారు.

# భూముల రీసర్వే వెంటనే ఆపాలి

## గత రీసర్వేతో గ్రామాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు - ప్రస్తుతం ఉన్న తప్పులు సరిదిద్దాక కొత్త సర్వే చేపట్టాలి వామపక్షాలు,రైతు కూలీ సంఘాలు ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి - రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ ఎం.జితేంద్ర



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన భూముల రీ సర్వే వెంటనే ఆపాలని రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ (డిఆర్ఓ) మారిశెట్టి జితేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేవల్ల 6,800 గ్రామాల్లోని రైతులు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారని, ఆ తప్పులు,సమస్యలు పరిష్కరించిన తర్వాతే కొత్తగా రీ సర్వే చేయాలని అన్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూఅబశ్రీశ్రీ కూటమి ప్రభుత్వంఅబశ్రీశ్రీకూడా మళ్ళీ రీ సర్వే అంటే తప్పు మీద తప్పు చేయడమేనని విమర్శించారు.గతం వైసీపీ పాలనలో అధికారులు రీ సర్వే హడావిడిగా జరగడం వల్ల అనేక తప్పులు జరిగాయని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు నష్టపోయారన్నారు..ఉదాహరణకు ఏడాది పట్టే రీ సర్వే కార్యక్రమాన్ని మూడు నెలల్లోఅబశ్రీశ్రీ హడావిడిగా పూర్తి చేస్తే తప్పులే దొర్లు తాయని ఆయనచెప్పారు.కలెక్టర్,జాయింటు కలెక్టర్ స్థాయి అధికారులు శ్రద్ధ తీసుకుని తహశీల్దార్లను అడిగితే ఎక్కడ తప్పులు జరిగాయో చెబుతారనిజితేంద్రచెప్పారు.ఉన్నతాధికారులు మెహర్బానీ కోసం త్వరగా పూర్తి చేసేస్తామని ప్రభుత్వ పెద్దలకు చెబుతారని,దాంతో కింది సిబ్బంది హడావిడిగా సర్వే ముగించేస్తారని,మళ్ళీ మళ్ళీ అవే తప్పులు పునరావృతం అవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇక మ్యుటేషన్ త్వరగా అవ్వడం లేదని, తహసీల్దార్లు రిపోర్టు పంపినా కలెక్టర్ ఆఫీసులో కొర్రీలు వేస్తుంటారని అలా కాకుండా మ్యుటేషన్ కూడా త్వరగా చేయాలని ఆయన సూచించారు. 22 ఎ రిజిస్ట్రేషన్ లో కూడా చాలా పొరపాట్లు జరిగాయని జితేంద్ర వివరించారు.ఇనాం భూముల విషయంలో కూడా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, దేవస్థానం భూములు కానట్లయితే ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన సూచించారు.

### అంబటికి జాతీయస్థాయి

# స్వర్ణ నంది ఎక్సలెన్స్ అవార్డు అందజేత



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామానికి చెందిన మనందరికీ గర్వకారణమైన శ్రీసంఘమిత్ర విద్యాలయ డైరెక్టర్ కరస్పాండెంట్ అంబటి శ్రీనివాసరావుని జాతీయస్థాయి స్వర్ణ నంది ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. విద్యారంగంతో పాటు సామాజిక సేవల రంగాల్లో ఆయన చూపిన నిబద్ధత, సేవా తత్వాన్ని గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును నిర్వాహక సంస్థలు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి 7 గంటలకు విజయవాడలోని ఆలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, ప్రముఖ సినీ నటుడు మొల్లేటి బాలాజీ,పూర్ణిమల చేతుల మీదుగా అంబటి శ్రీనివాసరావు ఈ జాతీయ స్థాయి అవార్డును స్వీకరించారు. ఈ శుభసందర్భంలో మిత్రులు, విద్యావేత్తలు, గ్రామస్థులు ఆయనను హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించి, సేవల పరంగా మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# రాయవరం రానున్న సీఎం చంద్రబాబు

## జనవరి 9 న రాయవరం, చెల్లూరు గ్రామాలలో సిఎం పర్యటన సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో, ఎమ్మెల్యే వేగుళ్ళ తుది పరిశీలనకు నేడు రాయవరం రానున్న జిల్లా కలెక్టర్ కీర్తి, పెందుర్తి వెంకటేష్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయవరం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు లు క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ మాట్లాడుతూ జనవరి 9వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా, రాయవరం, చెల్లూరు గ్రామాలలో పర్యటన దృష్ట్యా, స్థానిక శాసన సభ్యులతో కలిసి రాయవరం, చెల్లూరు గ్రామాలలో సీఎం సభ ఏర్పాటు కోసం సభ స్థలం, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లపై పరిశీలన చేశామని వివరించారు. మండపేట నియోజకవర్గంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి రాయవరం రానున్నారని, హెలీ ప్యాడ్ ఏర్పాట్లు, పార్కింగ్, విఐపీ గ్యాలరీ, సమావేశ ప్రాంగణం తదితర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ళ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సలహాదారు పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి నేడు క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించి, తుది స్థల నిర్ధారణ చేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రఘువీర్, రాయవరం ఎంపిడిఓ కీర్తిస్పందన, మండల తహశీల్దార్ బి.వి భాస్కర్, ఎంఈఓ సూర్యనారాయణ తదితర సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మద్దాల చేతుల మీదుగా ఎస్ఎస్సి మెటీరియల్స్ పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీరంగపట్నం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఏ సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నానని సర్పంచ్ మద్దాల పెద్దమ్మజీ రమణ అన్నారు. సోమవారం శ్రీరంగపట్నం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు తన ఆర్థిక సహాయంతో పదో తరగతి స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు భోజనం సమయంలో కూర్చోడానికి సరైన వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలపగా, వెంటనే సర్పంచ్ స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని మిగిలిన రెండు పాఠశాలల విద్యార్థులకు తన తల్లిదండ్రుల పేరు మీద భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తానన్నారు. తనకు విద్య లేకున్నా, చదువుకునే విద్యార్థులకు పోటీ పరీక్షలకు వెళితే అన్ని విధాల సహకరిస్తానన్నారు. ఇటీవల ఆటల పోటీల్లో తృతీయ స్థానం సాధించిన విజేతలను, పీఈటీలను ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మద్దాల దుర్గ ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు తన్నీరు తాతాజీ, సెక్రటరీ స్వామి, యుటిఎఫ్ నాయకులు శివబాబు, ఎం శ్రీనివాస్, మద్దాల కృష్ణ, ఉపాధ్యాయసిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వలస వాదుల పదానికి లీలాకృష్ణ స్పష్టతివ్వాలి : వాసిరెడ్డి అర్జున్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల పట్టణంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావుకు పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల అభివృధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ పలు వివాదస్పద వలస పక్షులు పేరుతో వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సోమవారం వైకాపా నాయకులు రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రటరీ వాసిరెడ్డి అర్జున్ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ లీలాకృష్ణ అనేక సమావేశాల్లో వలసవాదులు, వలస పక్షులు అంటూ చేస్తున్న పదాలు ఎవరిని ఉద్దేశించి ఉపయోగిస్తున్నారు వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. గురవింద ధోరణి మానుకొని కూటమి నాయకులు ఎక్కడెక్కడి నుంచి పోటీ చేసి గెలిచారో గుర్తించుకోవాలని అన్నారు. ఆ మాటకొస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్, నారా లోకేష్ వంటి నాయకులు ఎక్కడ నుంచి పోటీ చేశారో తెలియదా అని విమర్శించారు. వలస పక్షులు అన్నమాట ఈ నలుగురి నాయకులలో ఎవరికి వర్తింపజేస్తూ మీరు వ్యాఖ్యానిస్తున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా లీలాకృష్ణ ధోరణి మార్చుకుని ప్రజాక్షేత్రంలో అభాసుపాలు కాకుండా ఉండాలని హితవు పలికారు.

# వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంతో ఉపాధికి చేయూత : రొంగల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి ప్రధానమంత్రి మోదీ కొత్త రూపును తీసుకువచ్చి అందరికీ మేలు కలిగేలా వికసిత్ భారత్ జి రామ్ జీ పథకంగా రూపొందించారని పశ్చిమ గోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్ అన్నారు. సోమవారం సచివాలయంలో సర్పంచ్ దేవిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ జి రామ్ జి గ్రామసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని 100 రోజుల నుండి125 రోజులకు పెంచడం వల్ల కూలీలకు, రైతాంగానికి మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా మౌలిక వసతులు,రహదారుల అనుసంధానం, గ్రామ పంచాయతీ, పాఠశాల అదనపు గదుల నిర్మాణం,పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఈ పథకం ఉపయోగపడు తుందన్నారు. రైతుల వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా 60 రోజులు విరామం ఉంటుందన్నారు.మిగిలిన 125 రోజులు ఉపాధిహామీ గ్యారంటీ లభించడం పేదప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుచ్చు చెల్లారావు, సెక్రటరీ నదీషా, పిల్లి సురేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించండి : నదీషా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సొమ్ము దుర్వినియోగాన్ని, సమయాన్ని ఆదా చేయడానికి ఇటీవల స్వర్ణ పంచాయతీ యాప్ తీసుకుని వచ్చిందని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటి పన్నులు, మంచినీటి కుళాయిల పన్నులు సకాలంలో చెల్లించాలని గోనగూడెం సెక్రటరీ నదీషా అన్నారు. సోమవారం ఆమె విశ్వం వాయిస్ న్యూస్ విలేకరితో మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఇంటి యజమానులు ఇంటి వద్ద నుండి నేరుగా ప్రభుత్వానికి పన్నులు చెల్లించుకోవచ్చు అన్నారు. పశ్చిమ గోనగూడెం గ్రామంలో ఇంకా చాలామంది ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించలేదని, గ్రామస్తులు యాప్ ద్వారా కానీ నేరుగా సచివాలయంలో కానీ త్వరగా చెల్లించి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. గత విధానం మాదిరిగా ఇంటి పన్ను డిమాండ్లు ఇచ్చే పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికిందన్నారు.

సినీ వాయిస్ CINEMA

# ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో 'జాకీ' సినిమా..




పీకే7 స్టూడియోస్ సమర్పణలో డాక్టర్ ప్రగభల్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం జాకీ. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించి రిలీజైన ఫస్ట్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇదేదో డిఫరెంట్ మూవీలా ఉందనిపించింది. తాజాగా ఈ మూవీకి సంబంధించి టీజర్ రిలీజ్ కాగా అంచనాలు మరింత పెరిగాయి. ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో 'జాకీ' సినిమా.. టీజర్ అద్దిరిపోయిందిగా.. పీకే 7 స్టూడియోస్ నిర్మిస్తున్న కొత్త తమిళ సినిమా 'జాకీ' టీజర్ విడుదలైంది. ఈ సినిమా మధురై గ్రామీణ నేపథ్యంలో రూపొందింది. చెన్నైలో జరిగిన వీధి తిరువిళా ఉ 13వ ఎడిషన్ కార్యక్రమంలో టీజర్‌ను విడుదల చేశారు. 2021లో వచ్చిన 'మడ్డీ' సినిమా తర్వాత, 7 స్టూడియోస్ మరోసారి దర్శకుడు డా. ప్రగభల్ కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది.ప్రేమ కృష్ణదాస్ ఉ సి దేవదాస్ & జయ దేవదాస్ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో యువన్ కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటించారు. శక్తి బాలాజీ ఈ సినిమా కి సంగీతం అందించారు. మధురై నేపథ్యంలో సాగే 'జాకీ' కథ గ్రామాల్లో జరిగే సంప్రదాయ పొట్టేలు పోరాటం చుట్టూ తిరుగుతుంది. ఈ పోరాట సన్నివేశాలు అన్ని సహజం గా తెరకెక్కించడానికి ఒక మూడు సంవత్సరాలు ఆ ప్రాంతంలో సినీ బృందము చాలా కృషి చేసి నేటివిటీ మిస్ అవ్వకుండా ఈ సన్నివేశాలు చిత్రీకరణ జరిపారు. నటీనటులు నిజమైన పొట్టేలుతో శిక్షణ తీసుకొని నటించారు. 'జాకీ' సినిమా ద్వారా గ్రామీణ జీవితం, ప్రజల భావోద్వేగాలు, సంప్రదాయ క్రీడను సహజంగా ప్రేక్షకులకు చూపించనున్నారు. టీజర్ విడుదలతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. మరిన్ని విషయాలు త్వర లోనే వెల్లడిస్తామని చి ( త ... య ు ా ని ట్ తెలిపారు.

## రాజమౌళి - మహేష్ బాబు
# 'వారణాసి' వచ్చేది ఎప్పుడంటే..?




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళిఉటాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెర్రక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి'ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని ఏప్రిల్ 9, 2027న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. శ్రీరామ నవమి సందర్భంగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తుండగా, దాదాపు రూ. 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథ కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. సినిమాను పూర్తిగా ఐమాక్స్‌ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.

# రామ్ చరణ్‌తో సినిమా నిజమేనా..?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో "మన శంకర వరప్రసాద్ గారు" సినిమా సంక్రాంతికి స్పెషల్ గా రాబోతుంది. ఐతే, ఈ సినిమా తర్వాత అనిల్ రావిపూడి చేయబోయే సినిమా పై ఇప్పుడు ఓ వార్త వైరల్ అవుతుంది. 'మన శంకర వరప్రసాద్ గారు' ట్రైలర్, రామ్ చరణ్ కి చాలా బాగా నచ్చిందట. ఈ విషయాన్ని అనిల్ రావిపూడినే బయటపెట్టాడు. చరణ్ చాలా ఎక్స్‌టార్డినరీగా ఉందని చెప్పాడట. మొత్తానికి అనిల్ రావిపూడి వర్క్ చరణ్ కి నచ్చింది.ఈ నేపథ్యంలో రామ్ చరణ్ (ఞఎ జష్ఘుతీఘఅ) తో సినిమా చేయాలని, పైగా పాన్ ఇండియా లెవెల్లో సినిమా చేయాలని అనిల్ రావిపూడి ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రీసెంట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. తన నుంచి రాబోయే రోజుల్లో కచ్చితంగా పెద్ద స్పాన్ ఉన్న పాన్ ఇండియా సినిమా వస్తుందని చెప్పుకొచ్చాడు. దీనిబట్టి, అనీల్ రావిపూడి దర్శకత్వంలో చరణ్ సినిమా వచ్చే అవకాశం ఉంది. ఐతే, "మన శంకర వరప్రసాద్ గారు" విజయాన్ని బట్టి అది ఆధారపడి ఉంటుంది.

క్రీడా వాయిస్

# షారుఖ్ టీం వెనుక ఇంత పెద్ద సామ్రాజ్యం ఉందా..?



కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీని నైట్ రైడర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఇందులో షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు 55% వాటా ఉండగా, మిగిలిన 45% వాటా బాలీవుడ్ నటి జూహీ చావ్లా, ఆమె భర్త, ప్రముఖ పారిశ్రామికవేత్త జయ్ మెహతాలకు ఉంది. ఐపీఎల్‌లో అత్యంత క్రేజ్ ఉన్న జట్లలో కోల్‌కతా నైట్ రైడర్స్ ఒకటి. కేకేఆర్ అంటే మనకు వెంటనే గుర్తొచ్చే పేరు కింగ్ ఖాన్ షారుఖ్ ఖాన్. అయితే ఈ జట్టుకు షారుఖ్ ఒక్కడే యజమాని కాదు. ఆయనతో పాటు మరో ప్రముఖ జంటకు కూడా ఈ ఫ్రాంచైజీలో భారీ వాటా ఉంది. ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ నియామకం చుట్టూ జరిగిన వివాదంతో కేకేఆర్ యజమానుల వివరాలు మరోసారి ఆసక్తికరంగా మారాయి.

**కేకేఆర్ అసలు యజమానులు ఎవరు?**

కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీని నైట్ రైడర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఇందులో షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు 55% వాటా ఉండగా, మిగిలిన 45% వాటా బాలీవుడ్ నటి జూహీ చావ్లా, ఆమె భర్త, ప్రముఖ పారిశ్రామికవేత్త జయ్ మెహతాలకు ఉంది. 2008లో కేవలం రూ. 623 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు విలువ ఇప్పుడు ఏకంగా రూ. 9,139 కోట్లకు (సుమారు 1.1 బిలియన్ డాలర్లు) చేరడం విశేషం. హరూన్ రిచ్ లిస్ట్ 2025 ప్రకారం.. జూహీ చావ్లా దేశంలోనే అత్యంత సంపన్నమైన నటిగా నిలిచారు. ఆమె నికర ఆస్తి విలువ సుమారు రూ. 7,790 కోట్లు. గత ఏడాది (2024) ఇది రూ. 4,600 కోట్లుగా ఉండగా, కేవలం ఒక్క ఏడాదిలోనే ఆమె సంపద భారీగా పెరిగింది. కేకేఆర్ జట్టుతో పాటు రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుల్లో జూహీ కూడా ఒకరు. అలాగే రియల్ ఎస్టేట్, సిమెంట్ రంగాల్లో ఆమెకు భారీ పెట్టుబడులు ఉన్నాయి. జూహీ చావ్లా భర్త జయ్ మెహతా అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన మెహతా గ్రూప్ అధినేత. ఆయన వ్యక్తిగత ఆస్తి సుమారు రూ. 2,400 కోట్లు కాగా, ఆయన వ్యాపార సామ్రాజ్యం విలువ వి2.1 బిలియన్ల (సుమారు రూ. 17,555 కోట్లు) పైమాటే. ఈ జంటకు విదేశాల్లో కూడా పలు క్రికెట్ ఫ్రాంచైజీలు (ట్రిన్‌బాగో నైట్ రైడర్స్, లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్) ఉన్నాయి.

**ముస్తాఫిజుర్ వివాదం**

ఐపీఎల్ 2026 వేలంలో బంగ్లాదేశ్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రూ. 9.2 కోట్లకు కేకేఆర్ కొనుగోలు చేసింది. అయితే బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో అతడిని జట్టు నుంచి తొలగించాలని సోషల్ మీడియాలో డిమాండ్లు వచ్చాయి. ఈ క్రమంలో షారుఖ్ ఖాన్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ అతడిని విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంలో షారుఖ్‌తో పాటు జయ్ మెహతా, జూహీ చావ్లా కూడా కీలక పాత్ర పోషించారు.

# ఇకపై వైట్‌వాష్‌లు ఉండవు..
## టెస్టుల్లో సర్జికల్ స్ట్రైకులే.. బీసీసీఐకి గిల్ షాకింగ్ డిమాండ్



భారత టెస్టు క్రికెట్‌లో గత కొంతకాలంగా ఎదురవుతున్న పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని టీమిండియా టెస్ట్ ్కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నడుం బిగించారు. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0–2తో వైట్‌వాష్‌కు గురైన తర్వాత, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకూడదని గిల్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. భారత టెస్టు క్రికెట్‌లో గత కొంతకాలంగా ఎదురవుతున్న పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని టీమిండియా టెస్ట్ ్కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నడుం బిగించారు. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0–2తో వైట్‌వాష్‌కు గురైన తర్వాత, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకూడదని గిల్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. దీని కోసం ఆయన ఏకంగా బీసీసీఐ ముందు ఒక భారీ డిమాండ్ ఉంచారు. గిల్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత 13 నెలల కాలంలో టీమిండియా సొంతగడ్డపై రెండుసార్లు టెస్ట్ సిరీస్‌లలో ఘోరంగా ఓడిపోయింది. ముఖ్యంగా సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఓటమి బీసీసీఐని ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు, టీమ్ లీడర్‌షిప్ గ్రూప్‌తో బోర్డు నిర్వహించిన సమీక్ష సమావేశంలో శుభ్‌మన్ గిల్ తన మనసులోని మాటను బయటపెట్టారు. కేవలం నాలుగు రోజుల ముందు ప్రాక్టీస్ చేసి మైదానంలోకి దిగడం వల్ల ఫలితాలు రావడం లేదని, అందుకే ఇకపై ప్రతి టెస్ట్ సిరీస్‌కు ముందు కనీసం 15 రోజుల ట్రైనింగ్ క్యాంప్ ఉండాలని గిల్ డిమాండ్ చేశారు. గతేడాది ఆసియా కప్ ముగిసిన కేవలం 4 రోజులకే టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. అలాగే దక్షణాఫ్రికాతో సిరీస్ ముందు కూడా గిల్, ఇతర టెస్ట్ స్పెషలిస్ట్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 4 రోజులకే మ్యాచ్‌లోకి దిగారు. ఇలాంటి బిజీ షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు రెడ్ బాల్ క్రికెట్‌కు అలవాటు పడే సమయం దొరకడం లేదని గిల్ వాదిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. గిల్ ప్లానింగ్ పట్ల బీసీసీఐ, సెలెక్టర్లు చాలా సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గిల్ విజన్, క్లారిటీ చూసి బోర్డు కూడా అతనికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. భారత జట్టు బిజీ షెడ్యూల్ మధ్య 15 రోజుల క్యాంప్ నిర్వహించడం కత్తి మీద సామే. అయితే, దీని కోసం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఇప్పుడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను వాడుకోవాలని బోర్డు భావిస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బిజీగా ఉంటే, ఈ రెడ్ బాల్ క్యాంప్ బాధ్యతలను వివిఎస్ లక్ష్మణ్ కు అప్పగించే ఆలోచనలో కూడా బోర్డు ఉంది. గిల్ డిమాండ్ గనుక అమలైతే, భారత టెస్ట్ జట్టు మరింత పటిష్టంగా తయారవుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# ముంబై జట్టుకు కొత్త కెప్టెన్..

విజయ్ హజారే ట్రోఫీలో ముంబై జట్టును శార్దూల్ ఠాకూర్ నడిపిస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ అతనికి కాలి పిక్క గాయమైంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్‌లకు శార్దూల్ అందుబాటులో ఉండటం లేదు. ఇదే సమయంలో జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన శ్రేయస్ అయ్యర్‌కు మేనేజ్మెంట్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఎట్టకేలకు మైదానంలోకి అడుగుపెట్టడమే కాదు, రాగానే పవర్ ఫుల్ బాధ్యతను భుజాన వేసుకున్నాడు. గాయం కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరమైన అయ్యర్, ఇప్పుడు ముంబై జట్టు పగ్గాలను చేపట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జరగనున్న తదుపరి మ్యాచ్‌లలో ముంబై టీమ్‌కు అతను ్కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ముంబై రెగ్యులర్ ్కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ గాయపడటంతో అయ్యర్‌కు ఈ అవకాశం దక్కింది. నిజానికి విజయ్ హజారే ట్రోఫీలో ముంబై జట్టును శార్దూల్ ఠాకూర్ నడిపిస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ అతనికి కాలి పిక్క గాయమైంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్‌లకు శార్దూల్ అందుబాటులో ఉండటం లేదు. ఇదే సమయంలో జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన శ్రేయస్ అయ్యర్‌కు మేనేజ్మెంట్ ్కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో జరగనున్న మ్యాచ్‌తో అయ్యర్ ్కెప్టెన్సీ ఇన్నింగ్స్ మొదలుకానుంది. శ్రేయస్ అయ్యర్ కేవలం ఈ మ్యాచ్‌లలో ఆడటమే కాదు, తన ఫిట్‌నెస్‌ను కూడా నిరూపించుకోవాలి. న్యూజిలాండ్ తో జరగనున్న వన్డే సిరీస్ కోసం అయ్యర్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com